**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 37, పేజీలు - 08

ఆదివారం, ఆగస్టు 2, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తెలంగాణ క్రిమినల్ వేస్ట్ పార్టీ.?

**- రేవంత్ రెడ్డి క్రిమినల్ వేస్ట్ కామెంట్స్ కలకలం - కాక్రోచ్ తరహాలో క్రిమినల్ వేస్ట్ పార్టీ ఆవిర్భవిస్తుందా?**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, స్కిల్స్ లోపంపై మాట్లాడుతూ చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర తుఫాను రేపాయి. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా కనీసం ఒక ఉద్యోగ దరఖాస్తు కూడా సొంతంగా నింపలేకపోతున్నారని, ఇది విద్యావ్యవస్థ పరిధిలో క్రిమినల్ వేస్ట్ అని ఆయన వ్యాఖ్యానించడం విమర్శలకు దారితీసింది. ఈ కామెంట్లపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేత ఈటల రాజేందర్ వంటి వారు యువతను కించపర్చారని రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### జెన్ జీకి క్షమాపణలు చెప్పాలంటున్న బీఆర్ఎస్

ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సీఎం వెంటనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ అర్హతలు, కనీస పోటీ పరీక్ష

2లో..




# అజిత్ దోవల్‌కు లోకమాన్య తిలక్ అవార్డు

**- అమిత్ షా చేతుల మీదుగా ప్రధానం**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో తిరుగులేని సేవలు అందించిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను 'లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు' వరించింది. మహారాష్ట్రలోని పుణేలో ఈరోజు బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అజిత్ దోవల్‌కు అందజేశారు. ఈ వేడుకలో లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు కింద ఒక జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేశారు.

2లో..

## భావితరాలకు జీవంతో నిండిన భవిష్యత్తిస్తుంది హైడ్రా

- భారీ వర్షాలతో పూర్తిగా నిండిపోయిన చెరువు
- రూ. 20 కోట్లతో హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనుల సత్ఫలితం
- మురుగునీరు కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం
- హైడ్రాపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైడ్రాకు సంబంధించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. భావి తరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును హైడ్రా అంకితం చేస్తోందని పేర్కొన్నారు. వివరాలు ఉప్పల్‌లోని నల్లచెరువును హైడ్రా పునరుద్ధరణ చేపట్టింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉప్పల్ నల్లచెరువు వరద నీరుతో నిండి జలకళను సంతరించుకుంది. ఈ క్రమంలోనే ఉప్పల్ నల్లచెరువు గతంలో ఎలా ఉంది?, ప్రస్తుతం ఎలా ఉంది? అనేది తెలిపేలా

2లో..

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

**- తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ

2లో..

## భోగాపురం విమానాశ్రయం

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

**- ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణం**



- రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- ప్రధాని మోదీకి బొబ్బిలి వీణను బహూకరించిన ముఖ్యమంత్రి

**శ్రీకాకుళం (ప్రశ్న న్యూస్)** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ జస్టిస్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు

2లో..






## భోగాపురం ఎయిర్‌పోర్టు

# ఉత్తరాంధ్రకు మణిహారం

**- సరికొత్త చరిత్రకు నాంది పలికామన్న సీఎం చంద్రబాబు**

శ్రీకాకుళం (ప్రశ్న న్యూస్) భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగిస్తూ ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు.

2లో..

## లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

**- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళి బోనాలకు సర్వం సిద్ధమైంది. అమ్మవారికి భక్తితో బోనం సమర్పించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. నేడు ఉదయం 4 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం కానున్నాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు దాదాపు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక దర్శన

2లో..

## ప్రాణదాతగా మారిన హైదరాబాద్ మెట్రో

**- 25 నిమిషాల్లో అవయవాల తరలింపు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మెట్రో రైలు అత్యవసర అవయవ మార్పిడి కోసం ప్రత్యేక 'గ్రీన్ ఛానెల్'ను ఏర్పాటు చేసి, ప్రాణాలను కాపాడే బృహత్కార్యంలో కీలక భాగస్వామిగా నిలిచింది. గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు సజీవ అవయవాలైన గుండె, ఊపిరితిత్తులను మెట్రో ద్వారా అత్యంత వేగంగా తరలించారు. గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని

2లో..

## రీల్స్‌లోనే క్షమిస్తారా, కేసులు ఎత్తేస్తారా?

**- ప్రధాని మోదీ వీడియోపై అభిజీత్ దిప్కే ప్రశ్న**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన నిరసనలు తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. విద్యార్థుల డిమాండ్లకు తలొగ్గిన ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర

2లో..

## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

**- కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో సీజేఐ కీలక ప్రసంగం**



**జైపూర్ (ప్రశ్న న్యూస్)** వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజైన శనివారం ఆయన ప్రసంగించారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి రాకముందు

2లో..

# భారత మహిళా బాక్సర్ల పంచ్ పవర్

**- మహిళల బాక్సింగ్‌లో ఒకేరోజు 5 బంగారు పతకాలు**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత మహిళా బాక్సర్లు సంచలనం సృష్టించారు. యూకేలోని గ్లాస్గో వేదికగా శనివారం జరిగిన బాక్సింగ్ ఫైనల్స్‌లో ఏకంగా ఐదు స్వర్ణ పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. సాక్షి (51 కేజీలు), జాస్మిన్ (57 కేజీలు), ప్రీతి (54 కేజీలు), ప్రియ (60 కేజీలు), అరుంధతి చౌదరి (70 కేజీలు) తమ ఫైనల్ బౌట్లలో అద్భుతమైన ప్రదర్శనతో పసిడి పతకాలను ముద్దాడారు. ఈ విజయాలతో అంతర్జాతీయ బాక్సింగ్‌లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న విషయాన్ని మరోసారి చాటిచెప్పారు. శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత బాక్సర్ల జోరు ముందు ప్రత్యర్థులు నిలవలేకపోయారు. 51 కేజీల విభాగంలో సాక్షి చౌదరి, ఇంగ్లండ్‌కు చెందిన రూబీ వైట్‌పై 5–0 ఏకగ్రీవ నిర్ణయంతో ఘనవిజయం సాధించింది. బౌట్ ఆద్యంతం పదునైన ఫుట్‌వర్క్‌తో, కచ్చితమైన పంచ్‌లతో ప్రత్యర్థికి

2లో..



# తెలంగాణ క్రిమినల్ వేస్ట్ పార్టీ.?

రాసిన అనుభవం లేని సీఎం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ, జెన్-జీ యువత , ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ వ్యాఖ్యలపై తిరగబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ మాధ్యమాల్లో రేవంత్ వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసనను ఒక రాజకీయ ఉద్యమంగా మార్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా విభాగాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.

### కాక్రోచ్ తరహాలో క్రిమినల్ వేస్ట్ పార్టీ?

తాజాగా సోషల్ మీడియాలో కాక్రోచ్ అనే పదాన్ని ఒక విమర్శగా ఉపయోగించినప్పుడు, దాన్ని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో, సరిగ్గా అలాగే ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలను రీ-బ్రాండ్ చేస్తూ క్రిమినల్ వేస్ట్ అనే ట్యాగ్‌ను విద్యార్థులు ఒక నిరసన చిహ్నంగా మలుచునేలా చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. మేము క్రిమినల్ వేస్ట్ కాము.. నవ తెలంగాణ నిర్మాతలము అనే హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు, షార్ట్ వీడియోలతో జెన్-జీ తీవ్రస్థాయిలో రీ-కౌంటర్లు ఇస్తోంది. ఈ భావోద్వేగాన్ని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవడానికి క్రిమినల్ వేస్ట్ పార్టీ పెట్టేలా యువజన సమూహాలను ఆన్‌లైన్ వేదికగా ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నాయి.

### ట్రెండ్‌ను బట్టే రాజకీయం

భారత రాజకీయాల్లో ముఖ్యంగా పొలిటికల్ మీమ్‌లతో ఆడుకునే ప్రస్తుత జెన్-జీ తరం ఎప్పటికప్పుడు సరికొత్త నెరేటివ్‌లను సృష్టిస్తుంది. ఒక వివాదాస్పద పదాన్ని పట్టుకుని దాన్నే ఒక ఐడెంటిటీగా మార్చుకోవడం గ్లోబల్ డిజిటల్ ట్రెండ్. గతంలో కేటీఆర్, ఇతర నేతలు ఉపయోగించిన పదాలను కాంగ్రెస్ ట్రోల్ చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై విద్యార్థులు ఆత్మగౌరవ నిరసనలు తెలుపడానికి ప్రతిపక్ష పార్టీలు వెనకుండి బ్యాకింగ్, టెక్నికల్ సపోర్ట్, ట్రెండింగ్ ప్రోత్సాహాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.

### రేవంత్ అన్నది విద్యార్థుల్ని కాదు.. విద్యా వ్యవస్థని!

అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యాసంస్కరణలేనని కాంగ్రెస్ వర్గాలు సమర్థిస్తున్నాయి. డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేని విద్యార్థులను తీర్చిదిద్దడానికి జర్మనీ, ఫిన్లాండ్ మోడల్స్‌లో మొదటి రెండేళ్లు బేసిక్ విద్య, చివరి రెండేళ్లు ప్రాక్టికల్ విదేశీ లాంగ్వేజెస్, అప్రెంటిస్‌షిప్ నైపుణ్యాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొంటున్నారు. అయితే, విధానపరమైన లోపాన్ని ఎత్తిచూపే క్రమంలో వాడిన క్రిమినల్ వేస్ట్ అనే పదం కమ్యూనికేషన్ ఫెయిల్యూర్‌గా మారి, రాజకీయ ప్రత్యర్థులకు రాజకీయ ఆయుధంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు జెన్-జీ అసంతృప్తిని క్రిమినల్ వేస్ట్ ఉద్యమంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా, అది ఎంతకాలం మనుగడ సాగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# అజిత్ దోబాల్‌కు లోకమాన్య తిలక్ అవార్డు

దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న అజిత్ దోవల్ (81) భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. 'ఆపరేషన్ బ్లాక్ థండర్', డోక్లామ్ వివాదంలో వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల రూపకల్పనలో ఆయన పాత్ర అత్యంత ప్రశంసనీయం. 1968 కేరళ కేడర్‌కు చెందిన ఈ మాజీ ఐపీఎస్ అధికారి, మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేసి, ఆ తర్వాత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా సేవలు అందించారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ వంటి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇస్లామాబాద్, లండన్‌లలో భారత దౌత్య కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తమ రంగాల్లో సేవలు అందిస్తూ భారత్‌ను అత్యున్నత స్థాయిలో నిలిపిన ప్రముఖులకు ప్రతి ఏటా ఈ లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును ప్రధానం చేస్తున్నారు.

# భావితరాలకు జీవంతో నిండిన భవిష్యత్తిస్తుంది హైడ్రా

హైడ్రా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ పోస్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఉప్పల్ నల్లచెరువును పునరుద్ధరణ చేపట్టినందుకు హైడ్రాను అభినందించారు. "చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న మన హైదరాబాద్‌ను చూడటం నాకెంతో సంతృప్తినిచ్చింది! హైదరాబాద్ క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూ మన చెరువులకు జీవం పోస్తూ భావి తరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును అంకితం చేస్తోంది హైడ్రా ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదు భావి తరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా. ప్రతి చెరువును కాపాడుతూ ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతాం" అని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పేర్కొన్నారు.

### జలకళను సంతరించుకున్న ఉప్పల్ నల్లచెరువు

గతంలో భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపంగా మారిన ఉప్పల్ నల్లచెరువును హైడ్రా పునరుద్ధరించింది. ఈ క్రమంలోనే ఉప్పల్ నల్లచెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలు తొలగించి 70 ఎకరాల వరకు విస్తరించింది. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈ చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా వర్షాలు పడినప్పుడు వరద నీరు చెరువులోకి చేరేలా తక్కువ మొత్తంలో పారే మురుగు నీరు బైపాస్ చేసిన కాలువలోంచి బయటకు పోయేలా కాలువలను హైడ్రా అభివృద్ధి చేసింది. ఉప్పల్ నల్ల చెరువుకు ఎగువన ఉన్న నాచారం చెరువుతో పాటు పరిసరప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరేలా రెండు ఇన్‌లెట్లను హైడ్రా అభివృద్ధి చేసింది. ఇలా చెరువు నిండిన తర్వాత వరద నీరు సాఫీగా మూసీకి చేరేలా ఔట్‌లెట్‌ కూడా తీర్చిదిద్దింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువన ఉన్న ప్రాంతాలు నీట మునగకుండా వరదనీరు నల్లచెరువుకు చేరింది. దీంతో హైడ్రా పునరుద్ధరించిన ఉప్పల్ నల్ల చెరువు జలకళను సంతరించుకుంది.ఉప్పల్ నల్లచెరువులో నీటి నిల్వలే పరిమితం కాకుండా, ప్రజలకు విశ్రాంతి, ఆరోగ్యం, వినోదం కల్పించేలా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన మెయిన్ బండ్, పిల్లల కోసం ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా గడిపే ఆహ్లాదకరమైన ప్రదేశంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దుతున్నారు. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమైన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటని హైడ్రా అధికారులు తెలిపారు. ఇప్పటికే మూడు చెరువుల ప్రజలకు అంకితం కాగా, అదే తరహాలో ఉప్పల్ నల్లచెరువు కూడా త్వరలో నగరానికి మరో అందమైన జలవనరుగా మారనుందని పేర్కొన్నారు.

# అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ ఛైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాజిద్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుపై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను సిద్ధం చేస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

# లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

మార్గాలు, వాలంటీర్లు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లు పూర్తి చేశారు.ఆటు బోనాల సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారుపోలీసులు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆగస్టు 2 నుండి 4వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు ఆలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.మరోవైపు బోనాల సందర్భంగా ఆగస్టు 2 వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 4 వ తేదీ ఉదయం 6 గంటల వరకు రెండు రోజుల పాటు వైన్స్, రెస్టారెంట్స్, బార్ లను మూసివేయాలని ఆదేశాలు ఆదేశించారు.

ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ రోజులపాటు ఈ నిబంధనలు కఠినంగా అమల్లో ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. ఇక సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో రేపు నిర్వహించే అమ్మవారి మహా హారతిలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండాసురేఖ పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. అలాగే అమ్మవారికి 15 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని చివరగా బోనాలు, రంగం కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని పండితులు స్పష్టం చేశారు.

## భోగాపురం విమానాశ్రయం

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

శ్రీనివాసవర్మ, అశోక్‌గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోదీ టెర్మినల్ భవనంలో కలియదిరిగి ఆధునిక సదుపాయాలను పరిశీలించారు. విమానాశ్రయం ప్రత్యేకతలు, నిర్మాణ విశేషాలను జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.మల్లిఖార్జునరావు, బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర కళావైభవానికి ప్రతీకగా నిలిచే బొబ్బిలి వీణను బహూకరించి సత్కరించారు. పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. శనివారం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం

ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# ప్రాణదాతగా మారిన హైదరాబాద్ మెట్రో

కిమ్స్ ఆసుపత్రికి ఈ అవయవాలను తరలించాల్సి ఉండగా, రోడ్డు మార్గంలోని ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైద్య బృందం మెట్రో అధికారుల సహకారం కోరింది. దీనిపై తక్షణమే స్పందించిన అధికారులు ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. ఫలితంగా దాదాపు 14 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 25 నిమిషాల్లోనే అధిగమించి, అవయవాలను సురక్షితంగా కిమ్స్ ఆసుపత్రికి చేర్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అత్యవసర వైద్య సేవలకు, ప్రాణ రక్షణ చర్యలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మెట్రో రైలు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. కీలక సమయంలో మెట్రో అధికారులు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# భారత మహిళా బాక్సర్ల పంచ్ పవర్

ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. అదేవిధంగా, 57 కేజీల విభాగంలో జాస్మిన్.. నార్తర్న్ ఐర్లాండ్ బాక్సర్ మైఖేలా వాల్ష్‌పై 5-0తో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.54 కేజీల విభాగంలో ప్రీతి, కెనడా బాక్సర్ ఎస్.ఎస్. డెల్గాడోపై 5-0 తేడాతో గెలవడమే కాకుండా, బౌట్ మధ్యలో ప్రత్యర్థిని నాక్‌డౌన్ చేసి తన సత్తా చాటింది. ఇక 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి కూడా ఇంగ్లండ్ బాక్సర్ చాంటెల్ రీడ్‌పై 5-0తో సునాయాసంగా గెలిచింది. వీరితో పాటు 60 కేజీల విభాగంలో ప్రియ ఘూంఘాస్, కెనడాకు చెందిన మేరీ-బతౌల్ అల్-అహ్మదియాతో హోరాహోరీగా తలపడింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో 4-1 స్ప్లిట్ డిసిషన్‌తో ప్రియ విజేతగా నిలిచింది. తొలి రౌండ్‌లో కాస్త వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత పుంజుకుని పదునైన పంచ్‌లతో న్యాయనిర్ణేతలను మెప్పించింది.ఈ అద్భుత విజయాలతో అంతర్జాతీయ వేదికలపై మహిళల బాక్సింగ్‌లో భారత్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఒకే ఈవెంట్‌లో ఐదుగురు మహిళా బాక్సర్లు స్వర్ణాలు గెలవడం భారత క్రీడా చరిత్రలోనే ఒక అరుదైన ఘనత. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత పతకాల సంఖ్యను పెంచడంలో బాక్సింగ్ బృందం కీలక పాత్ర పోషించింది. మొత్తం టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రతిభ, వ్యూహాత్మక నైపుణ్యం ప్రదర్శించిన భారత మహిళా బాక్సర్లు, దేశానికి గర్వకారణంగా నిలిచారు.

# మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

నుంచే మన సంస్కృతిలో ఈ విధానం ప్రాచుర్యంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో శాసన, న్యాయవ్యవస్థలు ఈ పద్ధతిని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఒక నారింజ పండు కోసం వివాదానికి దిగిన ఇద్దరు సోదరీమణుల కథను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకరికి పండు గుజ్జు, మరొకరికి తొక్క అవసరమైనప్పటికీ, ఆ విషయం స్పష్టంగా మాట్లాడుకోకపోవడంతో వారు పండును చెరిసగం పంచుకున్నారని, ముందే తమ అవసరాల గురించి చర్చించుకుని ఉంటే ఇద్దరికీ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేదని వివరించారు. మన ప్రాచీన గ్రంథాలైన వేదాలు, రామాయణం, మహాభారతాల్లోనూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు పాలనా పద్ధతుల్లో మొదటిదైన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వం ఉద్భవించిందని విశ్లేషించారు. భారతీయ సంప్రదాయంలో వివాద పరిష్కారానికి తొలుత కుటుంబం (కుల), తర్వాత వర్గం (శ్రేణి), ఆపై సభ (పుగ) వద్దకు వెళ్లేవారని, ఇవన్నీ విఫలమైనప్పుడే రాజును ఆశ్రయించేవారని తెలిపారు. అంటే ఏ సమస్యకైనా మొదటి అడుగు ఎప్పుడూ సంప్రదింపులేనని ఆయన వివరించారు. ఇరుపక్షాల మధ్య స్నేహపూర్వక పరిష్కారం కుదర్చడమే తన న్యాయవాద వృత్తిలో అత్యంత సంతృప్తినిచ్చిన అనుభవమని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మధ్యవర్తిత్వం అనేది చట్టబద్ధం కావడానికి ముందే భారతీయుల రక్తంలో ప్రవహిస్తోందని, అది మన సంస్కృతిలో విడదీయరాని భాగమని జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో వివరించారు.

# క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ



**నాగర్ కర్నూల్** క్లాస్మేట్ క్లబ్ 365 రోజులు 365 కార్యక్రమాలలో భాగంగా 213 వ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభ దినోత్సవం పురస్కరించుకుని క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్ సూచన మేరకు తాడూరు మండలం ఆధ్వర్యంలో ఎంపీపీఎస్ తాడూరు ప్లలి పాఠశాల లో ఒకటో తరగతి విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓ.ఆ. విజయ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాండూర్ మండల విద్యాధికారి శ్రీ త్యాగరాజు గౌడ్ పాల్గొని మాట్లాడుతూ సమయోధుల సేవలను కొనియాడారు క్లాస్మేట్ అందిస్తున్న సహారాన్ని తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమలో తాడూరు క్లాస్మేట్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస ఆచార్యులు గారు మరియు ఉపాధ్యాయులు రాధిక, లక్ష్మి, రాములు పాల్గొనడం జరిగింది అదేవిధంగా పెద్ద ముద్దునూరు పాఠశాల యందు ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది.

# రీల్స్‌లోనే క్షమిస్తారా, కేసులు ఎత్తేస్తారా?

విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడంతో విద్యార్థులు శాంతించారు. అయితే జంతర్ మంతర్ వద్ద నుంచి పార్లమెంటు ముట్టడికి విద్యార్థులు పిలుపునిచ్చిన సమయంలో పోలీసులు, విద్యార్థులకు తీవ్ర వాగ్వాదం, లాఠీఛార్జ్ జరిగింది. ఈ క్రమంలోనే పలువురు విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీని దూషిస్తూ మరికొందరు విద్యార్థులు వ్యాఖ్యలు చేయగా వారిపై కూడా కేసులు పెట్టారు.అయితే ఇటీవల సోషల్ మీడియా వేదికగా సెల్ఫీ వీడియో విడుదల చేసిన ప్రధాని మోదీ తనను, తన దివంగత తల్లిని అనుచిత వ్యాఖ్యలు చేసిన విద్యార్థులను క్షమిస్తున్నానని పేర్కొన్నారు. అయితే ఈ వీడియోపై కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే వ్యంగ్యంగా స్పందించారు. ప్రధాని మోదీ రీల్‌లో మాత్రమే క్షమిస్తారా లేక నిరసనకారులపై నమోదైన కేసులను కూడా వెనక్కి తీసుకుంటారా అంటూ ఆ వీడియో కింద కామెంట్ చేశారు. ఇటీవల జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా కొందరు ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా వివాదం చెలరేగింది.ఈ నేపథ్యంలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన వీడియోలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.తిట్లు, దూషణలు ఏ సమస్యకూ పరిష్కారం కాదని తెలిపారు. అలాంటి యువతను కోర్టుల చుట్టూ తిప్పడం లేదా వేధించడం కంటే వారికి సరైన మార్గనిర్దేశం చేయడమే మంచిదని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తనను దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని తప్పుదోవ పట్టిన యువతను సరిదిద్దడం మన బాధ్యత అని చెప్పారు.అయితే దీనిపై స్పందించిన అభిజీత్ దిప్కే క్షమాపణ మాటల్లోనే కాకుండా నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల పేపర్ లీక్‌లు, విద్యా వ్యవస్థలో అక్రమాలపై జరిగిన ఆందోళనల సందర్భంగా అనేక మంది విద్యార్థులపై కేసులు నమోదయ్యాయని ఆయన గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, నిరసనల్లో ప్రధాని మోదీపై అసభ్య పదజాలం ఉపయోగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ బాలికపై నమోదైన జీరో ఎఫ్ఐఆర్ కూడా తీవ్ర వివాదాస్పదం అయింది. ఆ తర్వాత ఆ బాలిక వీడియో విడుదల చేసి తాను కేవలం 15 ఏళ్ల వయస్సు గలదని ఇతరుల ప్రభావంతో అలా మాట్లాడానని క్షమాపణ కోరింది. ఈ వ్యవహారంపై కూడా అభిజీత్ దిప్కే స్పందిస్తూ ఇలాంటి వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలు లేదా పార్టీ ఐటీ సెల్ సభ్యులపై ఎప్పుడైనా ఇదే విధంగా కేసులు నమోదు చేశారా అని ప్రశ్నించారు. దేశంలో అందరికీ ఒకే చట్టం అమలు కావాలని భావ ప్రకటనా స్వేచ్ఛపై చర్యలు తీసుకునేటప్పుడు సమాన ప్రమాణాలు పాటించాలని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఉపశమన చర్యలు చేపట్టగా, ఇతర కేసులపై విచారణ కొనసాగుతోంది.

# నకిలీ కలర్ జిరాక్స్ డిగ్రీ మెమో

### ప్రభుత్వ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం పొందిన వ్యక్తి అరెస్ట్

**కరీంనగర్** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు నకిలీ విద్యార్హత ధ్రువపత్రాన్ని ఉపయోగించి పై స్థాయి ప్రభుత్వ ఉద్యోగం పొందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు.విచారణలో నిందితుడు నలిగేటి తిరుపతి, తండ్రి గంగయ్య, వయస్సు 33 సంవత్సరాలు, తిప్పయ్యపల్లి గ్రామం, కొడిమ్యాల్ మండలం, జగిత్యాల జిల్లా నివాసి అని, గతంలో ఇతను ఎఖీంగా పనిచేశాడు. జగిత్యాల జిల్లా పెగడపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ, ప్రస్తుతం గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయానికి అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తున్నాడు.విచారణలో నిందితుడు తాను డిగ్రీ పూర్తి చేయకపోయినప్పటికీ, భవిష్యత్తులో ఉన్నత ప్రభుత్వ ఉద్యోగం పొందాలనే ఉద్దేశంతో తన భార్యకు చెందిన డిగ్రీ లాంగ్ మెమోను ఆధారంగా తీసుకొని, అందులో తన పేరు, తండ్రి పేరు, రోల్ నంబర్ తదితర వివరాలను మార్చి నకిలీ కలర్ జిరాక్స్ డిగ్రీ మెమో తయారు చేసుకున్నట్లు అంగీకరించాడు.తదనంతరం ప్రభుత్వం ఎఖీం/ఎఖీా వ్యవస్థను రద్దు చేసి, విద్యార్హతల ఆధారంగా ఉద్యోగాల కేటాయింపు చేపట్టిన సమయంలో, అప్పటికే ఎఖీంగా పనిచేస్తున్న నిందితుడు సదరు నకిలీ డిగ్రీ మెమోను సమర్పించి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని పొందినట్లు విచారణలో వెల్లడైంది.నిందితుడి వద్ద నుండి నకిలీ డిగ్రీ కలర్ జిరాక్స్ మెమోతో పాటు, నకిలీ ధ్రువపత్రం తయారీకి ఆధారంగా ఉపయోగించిన అతని భార్యకు చెందిన డిగ్రీ మెమో జిరాక్స్ ప్రతులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు లేదా ఇతర ప్రయోజనాల కోసం నకిలీ విద్యార్హత ధ్రువపత్రాలు, నకిలీ సర్టిఫికెట్లు లేదా తప్పుడు పత్రాలను ఉపయోగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని పోలీసులు హెచ్చరించారు.

# గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరం పాటుపడదాం

### – గ్రామ సర్పంచ్ రేండ్ల శారద

**కమాన్ పూర్.** కల్వచర్ల గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరం పాటు పడదామని గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి అన్నారు. శనివారం రామగిరి మండలంకల్వచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామసభ నిర్వహించారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామసభకు సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి అధ్యక్షత వహించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజలతో చర్చించి వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు.గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించే దిశగా తీర్మానాలు చేశారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కస్ప మహేందర్,కార్యదర్శి ప్రదీప్, వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్లు,ఆశ వర్కర్లు, లైన్ మెన్ ఆకుల శ్రీనివాస్,ప్రాథమిక ఆరోగ్య శాఖా డా దేవేందర్,అగ్రికల్చర్ ఏ ఈ అరవింద్ పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

# 2026 ఘనంగా ప్రారంభం

### – జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ

**ఆసిఫాబాద్, ఆగస్టు 01** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు 2026 సందర్భంగా "జీవితానికి స్థిరమైన ప్రారంభం కోసం తల్లిపాలు: పని చేస్తున్న వాటిని బలోపేతం చేద్దాం" అనే ఈ సంవత్సరపు ఇతివృత్తంతో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవగాహన పోస్టర్ ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పుట్టిన మొదటి గంటలోపు తల్లిపాలు పట్టించడం, శిశువుకు మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన పరిపూరక ఆహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ద్వారా శిశువుల ఆరోగ్యం, ఎదుగుదల, రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన జీవితానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారమని, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని పేర్కొన్నారు.పోషణ అభియాన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు జిల్లాలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, గర్భిణీలు బాలింతల సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోషణ అభియాన్ బృందం, సిడిపిఓలు పాల్గొన్నారు

# ఘనంగాఆషాఢ మాస గోరింటాకు సంబరాలు



**గోదావరిఖని:** గోదావరిఖని అడ్డగుంటపల్లి కృష్ణవేణి పాఠశాలలో శనివారం (01-08-2026) ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు సంబరాలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో గోరింటాకుకు ఉన్న విశిష్టతను వివరించారు. మన పండుగలు, ఆచారాలను భావితరాలకు పరిచయం చేసి, వాటిని ఆచరించడం ద్వారా భారతీయ సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకొని, సాంప్రదాయ దుస్తుల్లో ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొని ఆషాఢ మాస వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రెడ్డిపల్లి గ్రామం ఆధ్వర్యంలో వెయ్యి ఈత చెట్ల మొక్కలు నాటిన ఎక్సైజ్ సీఐ ముస్తఫా ఎస్సై అరుణ



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )వనమహోత్సవం సందర్భంగా వెయ్యి ఈత మొక్కలునాటడం వనమహోత్సవంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నర్సాపూర్ ఆధ్వర్యంలో రెడ్డిపల్లి గ్రామం సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ గ్రామ ప్రజల ఆధ్వర్యంలో చెరువు గట్టుపై వెయ్యి ఈత మొక్కలు, నాటడం జరిగింది . ఈ కార్యక్రమం నేషనల్ అగ్రో ఫౌండేషన్ సంస్థసహకారంతో నిర్వహించబడింది.చెరువుగట్టుఅభివృద్ధికార్యక్రమంలో భాగంగా మొక్కల నాటకం చేపట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేశారు.కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ముస్తఫా గారు, ఎక్సైజ్ ఎస్ఐ అరుణ గారు, సిబ్బంది రవి, షాహెద్, మహేష్ తదితరులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.వనమహోత్సవం ద్వారా ప్రకృతి సంపదను కాపాడాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటేష్ , గ్రామ సర్పంచ్, పద్మావతి అశోక్ గౌడ్ వార్డుసభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక గ్రామస్తులు, గౌడ సంఘ సభ్యులు, ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.

## జె ఎన్ టి యు రిజిస్ట్రార్ జయలక్ష్మి పై కుట్రలను అడ్డుకోవాలి

**- రాజ్యాంగ విలువలను కాపాడాలి**

**- రాష్ట్ర గవర్నర్ కు సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర వినతి**

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్(జేఎన్‌టీయూహెచ్) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆస్కాని జయలక్ష్మి పై అన్యాయంగా తొలగించాలని కొందరు నాయకులు చేస్తున్న కుట్రల పై చర్యలు తీసుకొని రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ శివప్రసాద్ శుక్ల కు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర విన్నపాన్ని తెలియజేశారు. స్వయం ప్రతిపత్తి కలిగి రాజ్యాంగ హోదాలో ఉన్న విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ పై రాజకీయ పలుకుబడిని వినియోగించి ఒత్తిడి తీసుకువచ్చి అనేక సంవత్సరాలుగా అంకితభావం తో ఉత్తమమైన సేవలు అందిస్తూ అర్హత సాధించి బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జయలక్ష్మి పై చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డా. ఎ. జయలక్ష్మి విశ్వవిద్యాలయంలో దిగువ స్థాయి ఉద్యోగం నుంచి తన కృషి, అంకితభావం, ప్రతిభ, నిజాయితీతో ఒక్కో మెట్టు ఎదుగుతూ నేడు రిజిస్ట్రార్ స్థాయికి చేరుకున్నారని, ఆమె సాధించిన ప్రతి పదోన్నతి ఆమె పనితీరు, అర్హత సేవా నిబద్ధతకు గుర్తింపు అని తెలిపారు. నిజాయితీ గల అధికారిని వెనుకబడిన (బిసి, సగర/ఉప్పర) వర్గానికి సంబంధించిన ఆధారంగా చేసుకొని పదవి నుంచి తప్పించే ప్రయత్నాలు జరిగితే, అది భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాల స్ఫూర్తికి విరుద్ధమని, అంతేకాకుండా బీసీ వర్గాలకు చెందిన ఉద్యోగులు మహిళల్లో తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించే చర్యగా నిలుస్తుందని వివరించారు. రాజ్యాంగ పరిరక్షకులుగాతమరు ఈ అంశంలో జోక్యం చేసుకొని న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని తెలంగాణ సగర/ఉప్పర సంఘం రాష్ట్ర కమిటీ విశ్వసిస్తోందని ఉప్పరి శేఖర్ సగర రాష్ట్ర గవర్నర్ కు తెలియజేశారు.

## సీఐ అంజిరెడ్డిని కలిసిన మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డిని శనివారం మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ అంజిరెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు గణేష్, మల్లేష్, వెంకటేష్ లు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన టిడిపి నాయకులు





**తుగ్గలి:**దతుగ్గలి మండల వ్యాప్తంగా శనివారం రోజున సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన తుగ్గలి నందు పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,ఉపాధ్యక్షుడు వెంకట రాముడు చౌదరి,అల్లా బకాష్, మాజీ ఎంపిటిసి వల్లే వెంకటేష్, కృష్ణయ్య లు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని గల బొందిమడుగుల గ్రామం నందు కేయీ శాంబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ప్రతాప్ యాదవ్,సొసైటీ డైరెక్టర్ మోహన్,బూత్ ఇన్చార్జిలు వీరేంద్ర, నరేష్ లు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు టిడిపి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో

# కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి

**- నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు 50 వేలు పరిహారంగా ఇవ్వాలి.**

**- బ్యాంకుల్లో ఉన్న రైతుల అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలి..**

**- తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి**

**- సిపిఐ, ఏపీ రైతు సంఘం డిమాండ్..**



**దేవనకొండ** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని నష్టపోయిన రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు పరిహారంగా చెల్లించాలని తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి బ్యాంకుల్లో ఉన్న రైతుల అన్ని రకాల అప్పులు రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కరువు పరిశీలన జీపు జాత దేవనకొండకు వచ్చిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రైతుల యొక్క పంట పొలాలను పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆకాశం వైపు ఆశగా చూస్తూ విత్తనాలు చల్లిన రైతన్నకు ఈ ఏడాది ప్రకృతి తీవ్ర నిరాశనే మిగిల్చిందన్నారు. కర్నూలు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వేలాది ఎకరాల్లో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతులు ఇప్పుడు పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. కుటుంబ పోషణ ఎలా చేయాలన్న ఆందోళనలో అనేక మంది రైతులు రోజులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన పంటలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతు కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు చెల్లించిన పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే భరించి, ఇప్పటికే రైతులు చెల్లించిన ప్రీమియం మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో తిరిగి జమ చేయాలని కోరారు. అలాగే కరువు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి రైతు కుటుంబానికి ఆరు నెలల పాటు నెలకు రూ.20,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయడంతో పాటు, పంట నష్టానికి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 3న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రైతులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.రాజకీయాలకు అతీతంగా రైతు సోదరులంతా ఈ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. మద్దిలేటి శెట్టి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె. నాగేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యుడు కారన్న, రైతు సంఘం జిల్లా నాయకులు తిమ్మప్ప సిపిఐ రైతు సంఘం నాయకులు బజారి వీరాంజి భాస్కర్ లక్ష్మన్న శ్రీనివాసులు రామాంజి రాహుల్, భూసల రామాంజి మధు నాగేంద్ర రామస్వామి మల్లి, టక్కు.రామంజి పలువురు రైతులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో 'కార్పొరేషన్' కష్టాలు

**- హోదా మారింది కానీ పరిస్థితి మారలేదు**

**- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, గుంతలమయమైన రోడ్లు**

**- కమిషనర్ ఎదుట ప్రజలు, ప్రజాప్రతినిధుల ఆవేదన**

**- వన్ వార్డు ఎవిరీ డే' కార్యక్రమంలో వెల్లువెత్తిన సమస్యలు**

**- నడవలేని రోడ్లు.. ప్రయాణికులకు నిత్య ప్రమాదాలు**

**- కలుషిత నీరు.. తాగునీటి కోసం అల్లాడుతున్న కాలనీలు**

**- కాగితాలకే పరిమితమైన రూ. 22 కోట్ల నిధులు**






**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ పురపాలక కార్పొరేషన్‌గా ప్రమోషన్ పొంది ఏడాది దాటినా, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. డ్రైనేజీ సమస్యలు, అధ్వాన్నపు రోడ్లు, తాగునీటి ఎద్దడి, కలుషితమవుతున్న నీటి వనరులతో పౌరులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్ కంటే పురపాలక కార్యాలయంగా ఉన్నప్పుడే తమ పరిస్థితి బాగుండేదని, హోదా పెరిగిన తర్వాత సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పార్టీలకతీతంగా నాయకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్ లోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన 'వన్ వార్డు ఎవిరీ డే' కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్, లలిత్ కుమార్‌లకు స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు తమ సమస్యల చిట్టాను విన్నవించారు. ఫిర్యాదులు చేసినా కనీసం మ్యాన్‌హోల్స్‌పై మూతలు కూడా పెట్టలేని దుస్థితి నెలకొందని ఆరోపించారు.

### నడవలేని రోడ్లు.. ప్రయాణికులకు నిత్య ప్రమాదాలు..

మేడ్చల్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. డ్రైనేజీ పనుల కోసం తవ్విన రోడ్లను తిరిగి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో బురదమయంగా మారుతున్నాయి. గ్రంథాలయం నుంచి హౌసింగ్ బోర్డు దారి, కిందిబస్తీ, వినాయక్‌నగర్, మార్కెట్ రోడ్డు, వివేకానంద విగ్రహం నుంచి గ్రంథాలయం వరకు, సూర్యనగర్, ముకుంద్ థియేటర్, రాయిలాపూర్, గిర్మాపూర్ రోడ్లు పూర్తిగా గుంతలమయమయ్యాయి. ఎత్తుపల్లాలు ఉన్న రోడ్లపై వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు బోనాల పండుగ సమీపిస్తున్నా రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కిందిబస్తీలో పండుగకు అడ్డంకిగా మారిన రోడ్డును తక్షణమే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయం రోడ్డులోనే వివిధ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రి ఉన్నందున రోజూ వందలాది మంది ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### కలుషిత నీరు.. తాగునీటి కోసం అల్లాడుతున్న కాలనీలు..

పట్టణంలోని ప్రధాన నీటి వనరులైన తుమ్మ చెరువు, పెద్ద చెరువులు డ్రైనేజీ నీరు కలవడం వల్ల తీవ్రంగా కలుషితమవుతున్నాయి. చెరువులు మురికికూపాలుగా మారకుండా నిరోధించేందుకు వెంటనే ఎస్‌టీపీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. తుమ్మ చెరువు వద్ద పూడిక తీసి, బతుకమ్మ ఘాట్ మరియు వాకింగ్ ట్రాక్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెద్ద చెరువును 'మినీ ట్యాంక్ బండ్'గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే నీరు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా రోజులను పెంచడంతో పాటు, కొత్తగా వెలిసిన కాలనీలకు తక్షణమే తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. బోర్లకు ఆధారమైన తుమ్మ చెరువు నుంచి అక్రమంగా నీటిని తరలించకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### పారిశుధ్య కార్మికుల జీతాల్లో కోత పై కమిషనర్ స్పందన..

కార్పొరేషన్‌గా మారిన తర్వాత పారిశుధ్య కార్మికుల వేతనాలు పెరగాల్సింది పోయి తగ్గడంపై మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీగా ఉన్నప్పుడు రూ.26 వేల వేతనం పొందిన కార్మికులకు, ప్రస్తుతం కార్పొరేషన్‌లో రూ.19 వేలే ఇస్తున్నారని, పెరిగిన ధరల నేపథ్యంలో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ సృజన స్పందిస్తూ, కార్మికుల వేతన పెంపునకు సంబంధించిన నివేదికలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు.

### కాగితాలకే పరిమితమైన రూ. 22 కోట్ల నిధులు..

గత మున్సిపాలిటీ పాలకవర్గం ఐదేళ్ల కాలంలో అభివృద్ధి పనులు జరిగాయని, అయితే పాలకవర్గం చివరి దశలో రూ. 22 కోట్లతో రూపొందించిన అభివృద్ధి ప్రతిపాదనలు కార్పొరేషన్‌గా మారాక కార్యరూపం దాల్చలేదని బీఆర్ఎస్ నేత భాస్కర్ యాదవ్ మరియు ఇతర నేతలు పేర్కొన్నారు. మేడ్చల్, పూడూరు – కిష్టాపూర్ డివిజన్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, నిలిచిపోయిన పనులతో పాటు అధ్వాన్నంగా మారిన బస్టాండ్ దుస్థితిని మెరుగుపరచడం, డంపింగ్ యార్డును తరలించడం వంటి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుధాంశుతో పాటు నడికొప్పు నాగరాజు, సత్యనారాయణ, చీర్ల రమేశ్, శ్రీనివాస్ గౌడ్, మణికంఠ గౌడ్, విష్ణుచారి తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మున్నెల్లి గ్రామపంచాయతీలో 10 కుటుంబాలు బిజెపిలోకి చేరికలు

**పోరుమామిళ్ల ( బి. కోడూర్)** బి .కోడూరు మండలంలో బిజెపికి జోష్ పెరిగింది ఎందుకు అనగా మున్నెల్లి గ్రామపంచాయతీలో 10 కుటుంబాలు బిజెపిలో చేరడం ఎంతో ఆనందదాయకంగా ఉన్నది ఇంకా ముందు ముందు మరిన్ని చేరికలు ఉంటాయని బిజెపి నాయకులు తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు బి కోడూరు మండల అధ్యక్షుడు పోలుబోయిన రవిచంద్ర బి కోడూరు మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా మురుకూటి వెంకటేశ్వర్ రెడ్డి కి, బి కోడూరు మండల కిసాన్ మోర్చా కార్యదర్శి గా ఓబులరెడ్డి వెంకటరమణారెడ్డి గారి కి నియామక పత్రం అందజేసి వారిని సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో బి కోడూరు మండల అధ్యక్షులు పోలుబోయిన రవిచంద్ర, కడప జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మున్నెల్లి చిన్న గురయ్య, కడప జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గాజులపల్లి శివారెడ్డి, కడప జిల్లా మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ గాజులపల్లి మౌనిక, మున్నెల్లి ఎశ్రీజీ 2 ఓబుల్ రెడ్డి రాఘవరెడ్డి,బి కోడూర్ కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, కార్యదర్శి వెంకటరమణారెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది



# డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి..

## మహిళలను గౌరవించాలి: గజ్వేల్ ఏసీపీ నరసింహులు

**- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రతపై అవగాహన సెమినార్ల పోస్టర్ ఆవిష్కరణ**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గజ్వేల్ ఏసీపీ నరసింహులు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనతో పాటు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలనే లక్ష్యంతో డివిజన్ వ్యాప్తంగా నిర్వహించనున్న అవగాహన సెమినార్ల పోస్టర్‌ను శనివారం ఏసీపీ నరసింహులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజంలో మహిళల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సామాజిక అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, డ్రగ్స్ మహమ్మారి, మహిళలపై పెరుగుతున్న దాడులపై విద్యార్థులు, యువతలో చైతన్యం తీసుకురావడమే ఈ అవగాహన సెమినార్ల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమాజంలో సానుకూల మార్పు కోసం ప్రతి విద్యార్థి, యువకుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు సందబోయిన ఎల్లయ్య, గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు సుద్దాల వంశీ, డివిజన్ కార్యదర్శి కోనేరు ప్రవీణ్ కుమార్, డివిజన్ నాయకురాళ్లు భవ్య, శృతి, నాయకులు ప్రవీణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా వ్యాప్తంగా

# పోలీసుల పరిశుభ్రత కార్యక్రమం

**- పరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ ప్రజలకు మెరుగైన సేవలకు నాంది**

**- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో శనివారం ఫటీగ్ డ్యూటీలో భాగంగా ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ ఆవరణలు, కార్యాలయ పరిసరాలు, రికార్డు గదులు, సందర్శకులు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్ ప్రాంతాలను శుభ్రపరిచారు. కార్యాలయాల్లోని ఫైళ్లు, రికార్డులను క్రమబద్ధీకరించి 5ూ విధానం (ాశీటీ, ాావ్ అఅ ాతీఎవతీ, ాప్తఅఅవ, ాఖఅఝతీఎఅఓవ, ాబఝఅఅ)ను అమలు చేశారు. అంతేకాకుండా మొక్కలు నాటి, ఇప్పటికే ఉన్న మొక్కలకు నీరు పోసి వాటి సంరక్షణ చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, మాట్లాడుతూ, "పరిశుభ్రత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదు. అది ప్రతి ఒక్కరి దైనందిన బాధ్యత. పరిశుభ్రమైన, క్రమబద్ధమైన పోలీస్ స్టేషన్ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడానికి దోహదపడుతుంది. ఫటీగ్ డ్యూటీలో భాగంగా చేపట్టే పరిశుభ్రత కార్యక్రమాలు, రికార్డుల క్రమబద్ధీకరణ, 5ూ విధానం అమలు వల్ల కార్యాలయాల పనితీరు మరింత మెరుగుపడుతుంది. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా, పచ్చదనంతో, క్రమశిక్షణతో నిర్వహించడం తమ బాధ్యతగా భావించి పనిచేయాలి" అని సూచించారు.పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రతను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని, కార్యాలయ రికార్డులు, ఫైళ్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.పరిశుభ్రమైన కార్యాలయ వాతావరణం ఉద్యోగుల పనితీరును మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## సర్ గడువు మరోసారి ఆగస్టు 10 వరకు పొడిగింపు

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఓటర్ ప్రత్యేక సవరణ గడువును ఆగస్టు 10 వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అర్హత గల ఓటర్లు అందరూ సర్ లో నమోదు చేసుకొని, అనర్హులు, మరణించిన వారు, ఒకే ఓటరు రెండు సార్లు ఓటరు గా నమోదు అయిన వారిని తొలగించాలన్నారు. సర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి 100 శాతం సర్ నమోదు చేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సవరించిన ాా×= షెడ్యూల్‌ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు చివరి తేదీ: 10-08-2026 పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ మరియు పునర్వ్యవస్థీకరణ: 10-08-2026 ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ: 17-08-2026 క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల స్వీకరణ కాలం: 17-08-2026 నుండి 16-09-2026 వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం (నోటీసు కాలం): 17-08-2026 నుండి 15-10-2026 వరకు తుది ఓటరు జాబితాల ప్రచురణ: 19-10-2026 ఉంటుందన్నారు.

# నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం - కంట్రోలర్ సత్తన్న

**- పదవి విరమణ వీడ్కోలు పలికిన ముషీరాబాద్ డిపో ఉద్యోగులు**





**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ, ముషీరాబాద్ డిపోలో శుక్రవారం నాడు ముగ్గురు ఉద్యోగులు బిసత్యనారాయణ, రమేష్, వెంకటేశ్వర్లుబి ల పదవీ విరమణ కార్యక్రమం డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఆర్టీసీ సంస్థలో సుదీర్ఘ కాలం36 సంవత్సరాలుబి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న స్నేహశీలి, మృదుస్వభావి, ఆప్తుడు సత్తన్న కి ఉద్యోగులు ప్రత్యేకంగా ఘన వీడ్కోలు పలికారు.ఆపదలో నేనున్నా అంటూ భరోసా ఇచ్చే సత్తన్న చిన్నా పెద్దా తేడా లేకుండా అందరితో ఆప్యాయంగా ఉండేవారు. దశాబ్దాల పాటు నిబద్ధతతో, నిజాయితీతో, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి, ప్రయాణికుల సేవకు అందించిన వారి అమూల్యమైన సేవలు చిరస్మరణీయం.ఉద్యోగ జీవితం ముగిసినా, వారు సంపాదించిన గౌరవం, అనుభవం, మంచి పేరు ఎప్పటికీ నిలిచి ఉంటాయి. వారి సేవా స్ఫూర్తి భావితర ఉద్యోగులకు ఆదర్శంగా నిలవాలని అందరూ కోరుకున్నారు.దేవుడు వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, ఆనందం, ఐశ్వర్యం ప్రసాదించి, పదవీ విరమణ అనంతర జీవితం సుఖశాంతులతో నింపాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహమ్మద్ మోసిన్, మహమ్మద్ ఆరిఫ్, అబ్దుల్ కలీం, అసిఫ్ ఆధ్వర్యంలో గజమాల, మెమెంటోతో ఘనంగా సత్కరించడం జరిగింది. అదేవిధంగా సీబీఎస్ చేంజ్ ఓవర్ ఉద్యోగుల టీమ్ కండక్టర్ లు మహమ్మద్ మోసిన్, మహేష్, రవీందర్, శివ కుమార్, యోగేందర్, రాజయ్య, సురేష్, నరేందర్ రఘురామ్, డ్రైవర్లు మోహన్ రావు, జగన్నాథం, మల్లికార్జున్, మైసయ్య, నారాయణ బాలరాజ్, కృష్ణ ఆధ్వర్యంలో మెమెంటోతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బిడిపో మేనేజర్ విజయ్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ చందర్, సూపర్ వైజర్లు యాదయ్య, దేవా, నరేందర్, పి.ఎన్.గౌడ్, కండక్టర్లు మోసిన్, మహేష్, రవీందర్, యోగేందర్, రాజయ్య, సురేష్, రఘురామ్, డ్రైవర్లు మోహన్ రావు, జగన్నాథం, మల్లికార్జున్, వివిధ యూనియన్ నాయకులు, గ్యారేజి సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితులుబి అత్యధిక సంఖ్యలో హాజరై ఘనంగా వీడ్కోలు పలికారు.

# ఒప్పంద పొరుగు సేవలు,చిరు ఉద్యోగుల ఆత్మ బంధువు సీఎం రేవంత్ రెడ్డి

**- ఒప్పంద,పొరుగు సేవల ఉద్యోగులకు ప్రతినెల ఒకటినే జీతం**

**- ముఖ్యమంత్రి మానవత్వానికి నిదర్శనం**





**జనగామ(ప్రశ్న న్యూస్)** చిరు ఉద్యోగి ఆత్మ గౌరవంగా బ్రతకాలని గుర్తించి చిరుద్యోగి ఇంటికి ఒకటవ తేదీనే పండగ తెచ్చిన ప్రజా ప్రభుత్వం.హర్షం వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్. గత 20 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో, అవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయంతో సుమారు రెండు దశాబ్దాలకు పైబడి కష్టాలను అనుభవిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభ్యున్నతికి పాటుపడిన ఒప్పంద అధ్యాపకులకు ప్రతి నెల ఒకటినే ప్రజా ప్రభుత్వం జీతాలు అందివ్వడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రవిశంకర్ హర్షం వ్యక్తం చేశారు.కాంట్రాక్ట్ ,ఔట్ సోర్సింగ్ వ్యవస్థలు మొదలైనప్పటి నుండి ఇప్పటి వరకు ఏ ఉద్యోగి ప్రతినెలా ఒకటినే జీతాలు అందుకోలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు పెట్టి ఆలోచించి ఏ సీఎం చేయని సాహసోపేత నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి తీసుకుని తమకు ఎనలేని సహాయం చేశారని రవిశంకర్ కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒప్పంద, పొరుగు సేవలు మరియు చిరుద్యోగుల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి ఆకుల రవిశంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే ప్రతీ చిరుద్యోగి కుటుంబాలు ఆనందం తో గడపాలని, ప్రతీ ఒక్కరూ అప్పుల పాలు అవ్వకుండా ఆత్మ గౌరవం తో బ్రతకాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతీ నెలా ఒకటినే జీతాలు ఉద్యోగులకు చెల్లిస్తుండటం తో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే లక్షలాది చిరుద్యోగుల కుటుంబాల్లో ఆయన వెలుగులు నింపారని కొనియాడారు. పిల్లల స్కూల్ ఫీజుల దగ్గరనుండి కిరాణా కొట్టు ఖర్చులకు డబ్బులు లేక అప్పుల పాలవుతూ ఏండ్ల తరబడి కుటుంబాలను నెట్టుకొస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ చిరు ఉద్యోగుల జీవితాలలో ఆనందం నింపే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాల చెల్లింపు నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం అని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకటవ తేదీనే జీతాలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుండటం తో సుమారు ఐదు లక్షల మంది చిరుద్యోగుల కుటుంబాలలో ఆనందం వెల్లివిరుస్తోంది. సుమారు ఇరవై సంవత్సరాల నుండి ఎప్పుడు జీతం వస్తుందో తెలియక ఖాళీ కడుపుతో అప్పుల పాలవుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్న ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానికి చిరుద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరో మారు నిరూపించుకుంది. గత ప్రభుత్వం ఒకటో తారీకు కాకుండా 15, 18 తేదీలలో రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చి తమకు మాత్రం మూడు, నాలుగు నెలలకు విడుదల చేసేదని, అవి కూడా ఏ ఆరు నెల్లకో, 8నెల్లకోసారి పడేవవి విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆగస్టు ఒకటవ తేదీనే జీతాలు ఇప్పించిన ఆర్థిక శాఖ మాత్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క కి, తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ కి ఇంటర్ విద్య కమిషనర్ కి, వివిధ జిల్లాల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్లు మరియు కళాశాలల నాన్ టీచింగ్ సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ తరపున పేరుపేరునా ఆకుల రవిశంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# మెడిసిటీలో ఘనంగా 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు' ప్రారంభం

**- త్వరలోనే మెడిసిటీలో 'మిల్క్ బ్యాంక్' ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు వెల్లడి**

**- సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరియు సుసేన హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు' ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగే ఈ వారోత్సవాలను షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ, సుసేన హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కల్పన మాట్లాడుతూ ప్రసవం తర్వాత వచ్చే పసుపు రంగు తొలిపాలు శిశువుకు తొలి టీకా లాంటివని, ఇవి అనేక అంటువ్యాధుల నుండి రక్షణ ఇస్తాయని తెలిపారు. ప్రభుత్వాలు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫీడింగ్ రూమ్‌లను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ శివరామకృష్ణ మాట్లాడుతూ తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన వరమని, శిశువు మానసిక, శారీరక ఎదుగుదలకు ఇవే అత్యుత్తమ ఆహారమని పేర్కొన్నారు. పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టడం అవసరమని చెబుతూ, త్వరలోనే మెడిసిటిలో 'మిల్క్ బ్యాంక్' ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.



అనంతరం సుశేన హెల్త్ కేర్ ప్రతినిధులు డా. సంతోష్ కుమార్ క్రాలేటి, డా. దుర్గా భవాని, డా. యాదయ్య వైద్య విద్యార్థులకు బ్రెస్ట్ ఫీడింగ్ ప్రాధాన్యతపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు, తల్లిపాలను ప్రోత్సహిస్తామని వైద్యులు, విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన ఫలకంపై సంతకాలు చేశారు. వారోత్సవాల ప్రాధాన్యతను చాటుతూ విద్యార్థినులు వేసిన రంగోళులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్ర సింగ్ నేగి, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్, డాక్టర్ డి.శైలేంద్ర మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ గీత మెడిసిటి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, ఘన్ పూర్ డాక్టర్ కల్పన, ప్రొపెసర్ అండ్ హెడ్, గైనకాలజీ విభాగం, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డాక్టర్ సి.సుదర్శన రాజు, ప్రొఫెసర్ అండ్ హెడ్, చిన్న పిల్లల వైద్య విభాగంతో పాటూ సుశేన హెల్త్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సంతోష్ కుమార్ క్రాలేటి, డాక్టర్ దుర్గా భవాని కాల్వపల్లి, డాక్టర్ యాదయ్య దామెర్ల తదితరులతో పాటూ కాలేజీ కి చెందిన వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడకు 8 ఆర్వోబీలు అమృత్ భారత్‌తో స్టేషన్‌కు కొత్త రూపు

**- సౌత్ కోస్ట్ రైల్వే జీఎంతో ఎంపీ కేశినేని చిన్ని భేటీ**

**- బెంగళూరు కొత్త రైలు, కొండపల్లి స్టేషన్ అభివృద్ధిపై ప్రతిపాదనలు**



విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ నగరంలో రైల్వే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు చర్యలు వేగవంతం చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ మాథుర్‌ను కోరారు. నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక రైల్వే అంశాలపై ఆయనతో విస్తృతంగా చర్చించారు. భేటీ అనంతరం ఎంపీ మాట్లాడుతూ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఎనిమిది రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్వోబీలు) నిర్మాణం అత్యవసరమని వివరించినట్లు తెలిపారు. ఎర్రకట్ట వంతెన, గుణదల ఎల్‌సీ-8 వద్ద ఆర్వోబీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

విజయవాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు టెండర్లు పిలిచినా స్పందన రాకపోవడం ఆందోళనకరమని పేర్కొన్న ఎంపీ, ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు కేంద్ర రైల్వే శాఖతో చర్చిస్తామని వెల్లడించారు. అలాగే అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద విజయవాడ స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని అన్ని ఎంపీలు కలిసి కోరనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ--బెంగళూరు (గుత్తి మీదుగా) కొత్త రైలు సేవను ప్రారంభించాలని, అలాగే కొండపల్లి రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో చేర్చి అభివృద్ధి చేయాలని జీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రధాన జంక్షన్లలో విజయవాడ ఒకటని, దేశంలోని వివిధ ప్రాంతాలను కలిపే కీలక రైల్వే కేంద్రంగా దీనికి ప్రత్యేక గుర్తింపు ఉందని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. విజయవాడ అభివృద్ధిలో రైల్వే కీలక పాత్ర పోషిస్తుందని, నగరానికి అవసరమైన ప్రతి రైల్వే ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.

# దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం

**- ఆగస్టులో కనిగిరి వరకు రైలు నడుస్తుందని ఎంపీ ప్రకటన**



దర్శి(ప్రశ్న న్యూస్) దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం అలిమ్కో సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ రాజబాబు, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 309 మంది దివ్యాంగులకు 143 బ్యాటరీ సైకిళ్లు, 59 ట్రైసైకిళ్లు, 30 వీల్‌చైర్లు, 40 వినికిడి యంత్రాలు, 37 చేతికర్రలను పంపిణీ చేశారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వికలాంగులకు "దివ్యాంగులు" అనే గౌరవప్రదమైన పేరు పెట్టి సమాజంలో వారికి మరింత గుర్తింపు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబునాయుడిదేనని పేర్కొన్నారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలుకు పెంచి వారికి ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా స్వయం సమృద్ధితో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తమకు అవసరమైన ప్రతి సందర్భంలో టీడీపీ, కూటమి ప్రభుత్వం, తాను అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అలిమ్కో సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దర్శి సొసైటీ అధ్యక్షుడు కాలువకొలను చంద్రశేఖర్, జిల్లా ఏడి సువార్తమ్మ, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ కె. అర్జునరావు, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ గుణుపూడి నారాయణస్వామి, రాష్ట్ర దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సునీల్ కుమార్, సందు వెంకట్రావు, పూసల ఓబయ్య, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ టీడీపీ రెండేళ్ల పాలనపై ప్రజల్లోకి

**- 31వ డివిజన్‌లో ప్రచారానికి శ్రీకారం చుట్టిన బొండా ఉమ**

**- సంక్షేమం--అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం**



విజయవాడ(ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్‌లో శనివారం "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని వర్ధన చర్చి వద్ద నుంచి ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధితో పాటు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో అమలు చేసిన పనులను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసంతో మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని బొండా ఉమ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దాట్ల రాజేష్, ఇంచార్జి కాకొల్లు మహేంద్రనాథ్ (బాబీ), దేవరపు మాల్యాద్రి, మురళి, గోవింద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గడపగడపకు కూటమి పాలన..

**- 22వ డివిజన్‌లో గళ్ళా మాధవి ప్రచారం - 'ఏఐతో దుష్ప్రచారం కాదు.. హుందాగా రాజకీయాలు చేయాలి' - అంబటి రాంబాబుపై ఎమ్మెల్యే విమర్శలు**



గుంటూరు(ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 22వ డివిజన్ శ్రీనివాసరావుపేటలో శనివారం "ఇంటింటికి కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. స్థానికులను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం విశేష పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు నేరుగా వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి బూత్, ప్రతి గడపకు చేరుకునే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రి అంబటి రాంబాబుపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయాల్లో విమర్శలు ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాల ఆధారంగా ఉండాలే తప్ప, ఏఐ సాంకేతికతతో తప్పుడు వీడియోలు రూపొందించి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఏఐ ఆధారిత తప్పుడు ప్రచారం వెనుక ఉన్న బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సాధికార సమితి సభ్యులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐలాపూర్‌లో 15 మందికి

# చేయూత పెన్షన్ల పంపిణీ

**- బీ ఆర్ ఎస్ నిర్లక్ష్యంతో ఆగిన పెన్షన్లు ఇప్పుడు అందుతున్నాయి: సర్పంచ్**

**- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి: పీరిలా సురేష్**

**- ఐలాపూర్‌లో చేయూత పెన్షన్ల పంపిణీ - 15 మంది లబ్దిదారులకు ఒకేసారి లబ్ధి**




**ఏటూరు నాగారం (ప్రశ్న న్యూస్)** గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న చేయూత పెన్షన్లను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులకు అందజేసింది. ఐలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ పీరిలా సురేష్ అధ్యక్షతన 15 మంది కొత్త లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. వీరిలో వృద్ధాప్యం 9, వితంతువులు 5, వికలాంగులు 1 మంది ఉన్నారు. సర్పంచ్ పీరిలా సురేష్ మాట్లాడుతూ గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం 2 ఏళ్లుగా పేదల పెన్షన్లను పట్టించుకోలేదు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి మోసం చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లోనే పేదల సంక్షేమానికి పెద్దపీట వేసింది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి అర్హుడికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇదే కాంగ్రెస్ పాలనకు, బీ ఆర్ ఎస్ పాలనకు తేడా. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోండి. వారికి కూడా త్వరలో మంజూరు చేయిస్తాం. పెన్షన్లు అందుకున్న లబ్దిదారులు, గ్రామస్తులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్లుగా ఆగిన సహాయం అందడంతో వారిలో ఆనందం వ్యక్తమైంది. గ్రామంలోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# వైభవోత్సవ గీతం

**- 17వ స్నాతకోత్సవం 1990 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం**

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ దర్శకుడు రాజమౌళి**






**పటాన్‌చెరు( ప్రశ్న న్యూస్)** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తన 17వ స్నాతకోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 1990 మంది విద్యార్థులకు 1532 మంది అండర్ గ్రాడ్యుయేట్, 372 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 86 మంది పీహెచ్.డీ. స్కాలర్లు పట్టాలు ప్రదానం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ చలన చిత్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, గీతం అధ్యక్షుడు-విశాఖపట్నం లోక్ సభ సభ్యుడు ఎం. శ్రీభరత్ అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా మహాత్మా గాంధీ విగ్రహానికి, గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా, చేనేత రంగంలో విశేష కృషి, భారతదేశపు గొప్ప వస్త్ర వారసత్వాన్ని పరిరక్షించడంలో అందించిన సేవలకు గుర్తింపుగా, భారతీయ చేనేత కళాకారుడు గజం గోవర్ధనకు గీతం గౌరవ డాక్టరేట్ (డీ.లిట్) ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శ్రీ రాజమౌళి స్నాతకులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి తత్వాన్ని గుర్తుచేస్తూ పట్టభద్రులను ఉత్తేజపరిచారు. అచంచలమైన అంకితభావం, అభిరుచి, కఠోర శ్రమ ద్వారా తాము ఎంచుకున్న రంగాలలో శ్రేష్ఠతను సాధించాలని సూచించారు. ప్రతి ప్రయత్నాన్ని నిబద్ధతతో, లక్ష్యంతో కొనసాగించాలని ఆయన పట్టభద్రులను ప్రోత్సహించారు. తన అధ్యక్షోపన్యాసంలో, శ్రీభరత్ పట్టభద్రులైన విద్యార్థులు అభినందిస్తూ, విజయానికి ఏడు మార్గదర్శక సూత్రాలను వివరిస్తూ రాజమౌళి సందేశాన్ని పునరుద్ఘాటించారు. పెద్ద కలలు కనండి, మిమ్మల్ని మీరు నమ్మండి, గొప్ప వ్యక్తులతో కలిసి ఉండండి. మీ లక్ష్యాల పట్ల అభిరుచితో నిబద్ధతతో ఉండండి. నిరంతరం నేర్చుకుంటూ, ఎదుగుతూ ఉండండి. వినయంగా ఉండండి, ఇచ్చిన మాటను ఎల్లప్పుడూ నిలబెట్టుకోండి అని సలహా ఇచ్చారు. 17వ స్నాతకోత్సవ కార్యక్రమం, విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి పట్ల గీతం హైదరాబాదు అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబించింది. ఈ కార్యక్రమం ద్వారా పట్టభద్రులైన వారు బాధ్యతాయుతమైన నిపుణులుగా, సమాజంపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపగల భవిష్యత్ నాయకులుగా ఎదిగేలా సాధికారత కల్పించింది.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు

# పారదర్శకంగా అమలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ హైమావతి**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలై అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా, అలాగే సంయుక్తంగా పలు పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. ఆయా పథకాలను పూర్తి పారదర్శకతతో అమలు చేసి, ప్రతి అర్హుడికి ప్రయోజనం చేకూరేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విద్య, వైద్యం, రైతు సంక్షేమం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, మత్స్యశాఖ, గ్రామీణాభివృద్ధి, పునరుత్పాదక ఇంధనం, మౌలిక వసతులు, భూగర్భ జలాల పెంపు, గృహ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, మహిళా సంక్షేమం, మానవ వనరుల అభివృద్ధి తదితర రంగాలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలై పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మాలల రోస్టర్ పాయింట్ సవరించి

# న్యాయం చేయాలి

**- ఎంసీఎఫ్ రాష్ట్ర నాయకురాలు బండ శకుంతల**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ఎస్సీ మాలలకు రోస్టర్ పాయింట్ల కేటాయింపులో సవరణ చేసి న్యాయం చేయాలని మాలల కోఆర్డినేషన్ ఫోరం (ఎంసీఎఫ్) రాష్ట్ర నాయకురాలు బండ శకుంతల డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ఎస్సీ మాలలకు రోస్టర్ పాయింట్ 22గా ఉండటం వల్ల విద్య, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. రోస్టర్ పాయింట్‌ను 22 నుంచి 12కు సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల విడుదలైన గ్రూప్-2, స్త్రీనిధి, ఆర్టీసీ, పోలీస్ తదితర ఉద్యోగ నోటిఫికేషన్లలో మాలలకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదని విమర్శించారు. రోస్టర్ పాయింట్ సవరణ జరిగే వరకు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల జారీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాలలకు జరుగుతున్న అన్యాయాలపై గ్రామ గ్రామాన అవగాహన కల్పించి సంఘటిత ఉద్యమం చేపడతామని తెలిపారు. 2011 జనాభా లెక్కలతో పోలిస్తే 2024 సామాజిక విద్యా సర్వేలో మాలల జనాభాను తగ్గించి చూపడం వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. వాస్తవానికి రాష్ట్రంలో మాలల జనాభా 30 లక్షలకు పైగా ఉందన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో పాటు సుప్రీంకోర్టు, హైకోర్టులను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఎంసీఎఫ్ రాష్ట్ర నాయకుడు పి. శంకర్ మాట్లాడుతూ, ఎస్సీ--ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధులను దళితుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణకు వినియోగించాలని కోరారు. మాలలు చిరు వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంసీఎఫ్ నాయకులు మాధవి, విశాలాక్షి, సతీష్, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు దుబాసి సంజీవ్, దాసరి ఏగొండస్వామి, బ్యాగరి వేణు, బక్కి నాగరాజు, మైసయ్య, చొక్కం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'లవ్ ఓ లవ్' మూవీ రివ్యూ!



ధనుశ్ మేనల్లుడు 'పవీష్' హీరోగా రూపొందిన రెండో సినిమానే 'లవ్ ఓ లవ్'. జులై 10వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, యూత్ నుంచి మంచి మార్కులను కొట్టేసింది. అలాంటి ఈ సినిమా, జులై 31వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. మగేశ్ రాజేంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, కథానాయికగా తెలుగు అమ్మాయి 'నాగదుర్గ' నటించింది. ఫోక్ సాంగ్స్ తో పాపులర్ అయిన నాగదుర్గని, కోలీవుడ్ కి పరిచయం చేసిన సినిమా ఇది. ఈ సినిమా ఏ స్థాయిలో ఆడియన్స్ ను ఆకట్టుకుందనేది ఇప్పుడు చూద్దాం. రఘు (పవీష్) ఓ మిడిల్ క్లాస్ యువకుడు. తల్లి .. తండ్రి .. ఓ చెల్లెలు .. ఇదే అతని కుటుంబం. పవీష్ తండ్రి పద్ధతి కలిగిన యజమాని. అప్పులు చేయడం అతనికి ఇష్టం ఉండదు. క్రెడిట్ కార్డుల ప్రస్తావన కూడా తీసుకురానీయడు. కార్పొరేట్ సంస్థలో పనిచేసి రఘు తెచ్చిన శాలరీని తండ్రి ఒక పద్ధతి ప్రకారం ఖర్చు చేస్తుంటాడు. అలాంటి పరిస్థితులలోనే రఘుకి 'అవంతిక' (నాగదుర్గ) పరిచయమవుతుంది. ఆమె కూడా ఓ కార్పొరేట్ సంస్థలో పనిచేస్తూ ఉంటుంది. తండ్రిలేని ఆమెను తల్లి పెంచుతుంది. అవంతికపై మనసుపడిన రఘు, ఆమె కోరిక మేరకు షాపింగులు .. సినిమాలు .. షికార్లు అంటూ తిప్పుతుంటాడు. అతని శాలరీ సరిపోకపోవడంతో అప్పులు చేయడం మొదలుపెడతాడు. చివరికి బ్యాంకు లోన్లు తీసుకోవడం చేస్తుంటాడు. అవంతిక కోరిక మేరకే ఆమెను తీసుకుని 'ఊటీ'కి వెళతాడు. అయితే ఆమె తల్లి, తన కూతురును రఘు కిడ్నాప్ చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తుంది. దాంతో రఘు తల్లిదండ్రులను పోలీసులు స్టేషన్ కి తీసుకుని వెళతారు. 'అవంతిక' కారణంగా రఘు జాబ్ పోతుంది. అతను వాయిదాలు కట్టని కారణంగా బ్యాంకు వాళ్లు 'బైక్' తీసుకుని వెళ్లిపోతారు. ఈ సమయంలోనే తన కొడుకు అప్పులు చేస్తున్నాడనీ .. తప్పించుకు తిరుగుతున్నాడనే విషయం రఘు తండ్రికి తెలుస్తుంది. జరుగుతున్న అవమానాలను భరించలేని రఘు తల్లిదండ్రులు, తమ కూతురు తీసుకుని సొంత ఊరు వెళ్లిపోతారు. తనని ఈ స్థితికి తీసుకొచ్చిన అవంతిక విషయంలో రఘు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? వాళ్ల ప్రేమ ఎలాంటి మలుపు తిరుగుతుంది? అనేది మిగతా కథ. ప్రేమలో పడటం .. బ్రేకప్ చెప్పుకోవడం ఈ కాలంలో చాలా ఈజీ అయిపోయింది. లవ్ లో పడటమంటే అబ్బాయిలు – అమ్మాయిలు కలిసి సరదాగా తిరగడం, పార్టీలు .. సినిమాలు అంటూ జల్సాలు చేయడం సర్వ సాధారణమైపోయింది. అబ్బాయిలతో అమ్మాయిలు ఇష్టానుసారంగా ఖర్చు చేయించడం .. మనసిచ్చిన అమ్మాయి కోసం ఎంత ఖర్చు పెట్టడానికైనా అబ్బాయిలు ఆలోచన చేయకపోవడం .. ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది? అనే అంశాన్ని దర్శకుడు తెరపైకి తీసుకుని వచ్చాడు. 'దుబాయ్' ఫ్లైట్ ఎక్కవలసిన రఘు పోలీస్ స్టేషన్లో పోలీస్ ఆఫీసర్ 'హరిశ్చంద్ర' ముందు ఉంటాడు. 'అవంతిక' అనే అమ్మాయిని ప్రేమ పేరుతో మోసం చేసి, అతను దుబాయ్ కి పారిపోతున్నాడని మహిళా సంఘాలు గొడవ చేస్తుండటంతో ఈ కథ మొదలవుతుంది. అంతవరకూ జరిగిన కథను, పోలీస్ ఆఫీసర్ కి రఘు వివరించే క్రమంలో ఫ్లాష్ బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. హీరో – హీరోయిన్ మధ్య జరిగిన వ్యవహారమంతా ఫస్టాఫ్ గా ఆడియన్స్ ను అలరిస్తుంది. ఇక తాను 'దుబాయ్'కి వెళ్లకుండా ఉండాలంటే .. అవంతికతో పెళ్లి విషయాన్ని గురించి ఆమె తల్లితో మాట్లాడాలంటే, అవంతిక ఒక షరతుకు ఒప్పుకోవలసి ఉంటుందని పోలీస్ ఆఫీసర్ తో రఘు తేల్చిచెబుతాడు. ఆ షరతు .. దాని తాలూకు ఎఫెక్ట్ కి సంబంధించిన సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది. నిజానికి ఈ సినిమాలో రఘు పెట్టే ఈ షరతే కొత్తగా అనిపిస్తుంది .. కొత్తదనాన్ని తీసుకొస్తుంది. ఆడియన్స్ ఎంజాయ్ చేసే పాయింట్ కూడా ఇదే. లవ్ .. రొమాన్స్ .. ఫ్రెండ్షిప్ .. ఫ్యామిలీ ఎమోషన్స్ తో కూడిన ఈ కథను బోర్ కొట్టకుండా నడిపించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడని చెప్పాలి. ప్రీ క్లైమాక్స్ వరకూ అమ్మాయిల ధోరణిని తప్పుబడుతూ వచ్చిన దర్శకుడు, అక్కడి నుంచి కథను బ్యాలెన్స్ చేయడానికి తనదైన పద్ధతిలో ప్రయత్నం చేశాడు. అది కూడా సమర్థవంతంగానే అనిపిస్తుంది. కాకపోతే అక్కడివరకూ చర్చిస్తూ వచ్చిన అంశాన్ని, హఠాత్తుగా డైవర్ట్ చేసిన ఫీలింగ్ కలుగుతుంది. ఫస్టాఫ్ వరకూ ఈ సినిమా చాలా సరదాగా సాగుతుంది. ఇక సెకండాఫ్ లో హీరో షరతు ఏమిటనేది తెలిసిన తరువాత, కథ ఎటు వైపు వెళుతుందనేది ప్రేక్షకులు క్లైమాక్స్ వరకూ ఊహించగలుగుతారు.

ప్రధానమైన పాత్రధారులంతా బాగా చేశారు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్, ఈ కంటెంట్ పెర్ఫెక్ట్ గా రావడానికి తమవంతు సపోర్టును అందించాయని చెప్పాలి. ప్రధానమైన పాత్రలు ఎమోషన్స్ నేపథ్యంలో చెప్పే డైలాగ్స్ బలంగా కనెక్ట్ అవుతాయి. (ప్రేమలో పడటంలో తప్పులేదు. కానీ అబ్బాయి ప్రేమను ఆసరాగా చేసుకుని, అమ్మాయిలు అతనితో ఇష్టానుసారం ఖర్చు చేయించకూడదు. ఆ ఎఫెక్ట్ అతని కెరియర్ పై .. అతని ఫ్యామిలీ పై పడుతుందనే విషయాన్ని మరిచిపోకూడదు. అలాగే 'నిజమైన ప్రేమ నిందచేయదు .. మన్నిస్తుంది' అనే విషయాన్ని అబ్బాయిలు గుర్తుపెట్టుకోవాలి అనే సందేశాన్ని ఇచ్చిన సినిమా ఇది. యూత్ కి కరెక్టుగా కనెక్ట్ అయ్యే కంటెంట్ అని చెప్పడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

## ఎనిమిదేళ్ల విరామం తర్వాత

# వెండితెరపైకి ప్రీతి జింటా

### – ఆమిర్ ఖాన్ బ్యానర్లో గ్రాండ్ రీఎంట్రీ



ఒకప్పుడు టాలీవుడ్ ప్రేక్షకులను సైతం మెప్పించిన బాలీవుడ్ నటి ప్రీతి జింటా... సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. మహేశ్ బాబుతో 'రాజకుమారుడు', వెంకటేశ్ సరసన 'ప్రేమంటే ఇదేరా' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు అలరించిన ఆమె, వివాహం అనంతరం సినిమాలకు దూరమయ్యారు.

ఇప్పుడు దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఒక భారీ పీరియాడికల్ డ్రామాతో గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ సరసన ప్రీతి జింటా కథానాయికగా నటించిన లేటెస్ట్ పీరియడ్ డ్రామా మూవీ 'బట్వార్ 1947'. 1947 నాటి దేశ విభజన నేపథ్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్ ఖాన్ నిర్మించగా, విలక్షణ దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి తెరకెక్కించారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. ప్రీతి జింటాతో పాటు సీనియర్ నటి షబానా అజ్మీ, ఆలీ ఫజల్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దేశ విభజన నాటి పరిస్థితులు, మానవీయ సంబంధాలు, ప్రజలు ఎదుర్కొన్న భావోద్వేగ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో ప్రీతి జింటా ఎంతో ప్రాధాన్యత ఉన్న, బలమైన పాత్రలో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని తుది పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# రెండో పెళ్లిపై సురేఖా వాణి ఫుల్ క్లారిటీ..



### ట్రోల్స్‌కు కూడా స్ట్రాంగ్ కౌంటర్!

సౌత్ సినీ ఇండస్ట్రీలో ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టుగా గుర్తింపు పొందిన సురేఖా వాణి మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల 'నీరమ్' సినిమా ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఆమె సోషల్ మీడియాలో తనపై వస్తున్న ట్రోల్స్, రెండో పెళ్లిపై జరుగుతున్న ప్రచారం, సినిమాల్లో అవకాశాలు తగ్గాయనే ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. సోషల్ మీడియాలో తాను, తన కుమార్తె సుప్రీత నాయుడుతో కలిసి చేసే పోస్టులపై వచ్చే విమర్శల గురించి మాట్లాడిన సురేఖా వాణి.. మొదట్లో ట్రోల్స్‌ను సీరియస్‌గా తీసుకున్నప్పటికీ ఇప్పుడు వాటిని పూర్తిగా పట్టించుకోవడం మానేశామని చెప్పారు. మనదేంటి.. నేనేంటి.. నాకేంటి అనేదే ఇప్పుడు నా ఆలోచన. నేను ఏం చేయాలనుకుంటానో అదే చేస్తాను. ఏ ఫోటో పోస్ట్ చేయాలనిపిస్తే అది పెడతాను. ఎలా ఫోటో దిగాలనిపిస్తే అలా దిగుతాను. ఇతరులు ఏమనుకుంటారో ఆలోచిస్తూ ఉంటే ముందుకు వెళ్లలేం అని ఆమె స్పష్టం చేశారు. గత కొంతకాలంగా సురేఖా వాణి రెండో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఆమె కుమార్తె సుప్రీత గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో "అమ్మకు పెళ్లి చేసిన తర్వాతే నేను పెళ్లి చేసుకుంటాను" అని చెప్పడంతో ఆ ప్రచారానికి మరింత ఊతమిచ్చింది. ఈ వార్తలపై స్పందించిన సురేఖా వాణి.. ప్రస్తుతం తనకు రెండో పెళ్లి చేసుకోవాలనే ఆలోచనే లేదని తేల్చిచెప్పారు. నాకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన ఉంటే ఇన్ని సంవత్సరాలు ఎందుకు వేచి ఉండేదాన్ని? ప్రస్తుతం అలాంటి ఆలోచన లేదు. ఇక ముందు కూడా ఉండదనుకుంటున్నాను. మా అమ్మాయికి పెళ్లి చేసే వయసు వచ్చింది. ఇప్పుడు నేను పెళ్లి చేసుకోవడం గురించి ఎందుకు ఆలోచిస్తాను? అయితే మీడియా మాత్రం నాకు చాలా కాలం క్రితమే పెళ్లి చేసేసింది అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఇటీవల సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నారని ప్రశ్నించగా, తనకు ఎందుకు పాత్రలు ఇవ్వడం లేదో దర్శక నిర్మాతలను అడగాలని సురేఖా వాణి సరదాగా సమాధానం ఇచ్చారు. అలాగే తన కుమార్తె సుప్రీతకు వచ్చే కథలన్నీ తాను కూడా వింటానని, అయితే వాటిలో నటించాలా వద్దా అనేది పూర్తిగా సుప్రీత నిర్ణయమేనని వెల్లడించారు. ట్రోల్స్‌పై ధైర్యంగా స్పందించడం, రెండో పెళ్లి వార్తలకు ఒకే మాటలో చెక్ పెట్టడం, సినిమాల్లో అవకాశాల గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో సురేఖా వాణి చేసిన ఈ కామెంట్స్ మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# మిస్టికల్ థ్రిల్లర్ కాళాంకి భైరవుడు

గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'కాళాంకి భైరవుడు'. హరిహరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కె.ఎన్.రావు, డా॥ రాచమల్ల శ్రీనివాస రావు తెరకెక్కిస్తున్నారు. రాజశేఖర్ వర్మ, రితికాచక్రవర్తి, పూజ కిరణ్, భవ్యశ్రీ కీలక పాత్రధారులు. ఇటీవలే విజయవాడలో ఈ సినిమాలోని 'ఏంటో ఎమో' అనే మెలోడీ గీతాన్ని ఆవిష్కరించారు. బ్లాక్‌మేజిక్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తీశామని, అనుక్షణం సస్పెన్స్ ప్రధానంగా అనూహ్య మలుపులతో ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ప్రేక్షకులకు సరికొత్త థియేట్రికల్ అనుభూతినిచ్చే చిత్రమిదని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: పీఆర్, దర్శకుడు: హరిహరన్.



## అనుపమ, తరుణ్ భాస్కర్‌ల

# 'క్రేజీ కళ్యాణం' టీజర్ రిలీజ్!




యువ నటి అనుపమ పరమేశ్వరన్, నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం'. అఖిల్ రాజ్, సీనియర్ నటుడు నరేష్ వీకే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తుండగా, బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చి సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంటోంది. పెళ్లి వేడుకల నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన సంఘటనలతో, పూర్తిగా నవ్వులు పంచే ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు తీర్చిదిద్దినట్లు టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. పెళ్లి అనగానే వచ్చే సందడి, ఆ వెనుక జరిగే సరదా గొడవలు, అనుపమ మరియు తరుణ్ భాస్కర్ ల మధ్య వచ్చే కామిక్ టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నరేష్ వీకే మరియు అఖిల్ రాజ్ పాత్రలు ఈ కథకు మరింత బలాన్ని చేకూరుస్తున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది.

ఈ సినిమాలోని వినోదాత్మక సన్నివేశాలకు తగ్గట్టుగానే ప్రముఖ సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. టీజర్ లోని ప్రతీ డైలాగ్ మరియు విజువల్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ తో పాటు సినిమా రిలీజ్ డేట్ ను కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

# అమ్మకు ఇచ్చిన మాట



సుడిగాలి సుధీర్, అయేషా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'సుధీర్స్ జోకర్'. పీఎస్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఆనంద మీడియా సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో నటి అభిరామి నటిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇందులో ఆమె గాయత్రీదేవి పాత్రలో కనిపించనుంది. శుక్రవారం ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. 'అమ్మకు ఇచ్చిన మాట చిరకాలం మిగిలిపోతుంది' అంటూ ఈ పోస్టర్‌పై రాసిన క్యాప్షన్ హార్ట్‌టచింగ్‌గా అనిపిస్తున్నది. సినిమాలో ఆమె పాత్ర ఎమోషనల్‌గా సాగుతుందని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాతలు: శ్రీనివాసులు పీవీ, విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ, రచన–దర్శకత్వం: పీఎస్ సునీల్ పుప్పాల.

# రష్మికకు గాయాలు



ప్రముఖ నటి రష్మిక మందన్న గాయపడ్డారు. 'మైసా' సినిమా పాట చిత్రీకరణలో భాగంగా డ్యాన్స్ రిహార్సల్స్ చేస్తుండగా ఒక్కసారిగా జారిపడటంతో ఈ ఘటన చోటుచేసుకున్నది. హుటాహుటిన ఆమెను సమీపంలోని హాస్పిటల్‌కి తరలించారు. వైద్యపరీక్షల అనంతరం రష్మిక తుంటి భాగంలోని కణజాలానికి బలమైన గాయమైనట్టు వైద్యులు గుర్తించారు. రష్మికకు తగిలిన ఈ గాయం విషయంలో వైద్యులు సైతం ఆశ్చర్యపోయారు. తీవ్రమైన శారీరక శిక్షణ పొందే క్రీడాకారుల్లో మాత్రమే ఈ తరహా గాయాలు కనిపిస్తాయని వారు వెల్లడించారు. ఆరు వారాలు ఆమెకు విశ్రాంతి అవసరమని సూచించారు. అనుకోని ఈ ప్రమాదం కారణంగా రష్మిక ప్రస్తుతం నటిస్తున్న చిత్రాలకు సంబంధించిన షెడ్యూల్స్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఆమెకు చెందిన సన్నివేశాలు, పాటలు, ఫైట్స్ ఉన్న షెడ్యూల్స్‌ని తాత్కాలికంగా మేకర్స్ వాయిదా వేశారు. కొన్ని రోజుల క్రితం కాకినాడ పోర్ట్‌లో అగ్ర నటుడు బాలకృష్ణ గాయపడ్డ విషయం తెలిసిందే. 'డ్రాగన్' షూటింగ్‌లో ఎన్టీఆర్ కూడా గాయాలపాలయ్యారు. 'పెద్ది' షూటింగ్ సమయంలో ఏర్పడ్డ గాయానికి కోయంబత్తూరు వెళ్లి రామ్‌చరణ్ సర్జరీ చేయించుకున్నారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో ఇప్పుడు రష్మిక కూడా గాయపడటంతో ఆందోళన వ్యక్తమవుతున్నది.

## విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు కాకతీయ హై స్కూల్ లో మాక్ ఎలక్షన్




**మంథని ( ప్రశ్న న్యూస్)** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడం, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం లక్ష్యంగా కాకతీయ హై స్కూల్ లో శనివారం మాక్ ఎలక్షన్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికల మాదిరిగానే నామినేషన్ల దాఖలు, ప్రచారం, రహస్య ఓటింగ్, బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి అన్ని దశలను విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. ప్రతి విద్యార్థి తన ఓటు హక్కును వినియోగిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ ఎలక్షన్ లలో హెడ్ బాయ్ గా బి.కౌశిక్,హెడ్ గర్ల్ విశ్వశ్రీ ,స్పోర్ట్ సెక్రటరీ ఓంకార్,డిప్యూటీ హెడ్ బాయ్ శ్రీ నాగచైతన్య,డిప్యూటీ హెడ్ గర్ల్ అంజలి ప్రియ, గెలుపొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ,సామాజిక కార్యకర్త,కనుకుంట్ల స్వామి వచ్చేసి విద్యార్థులకు భారత ప్రభుత్వం నిర్వహించే ఎలక్షన్ ల గురించి వివరించి,ఓటు హక్కు ఉపయోగం తెలియజేశారు.పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు విలువ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాల్సిన అవసరంపై అవగాహన కల్పించేందుకు ఈ మాక్ ఎలక్షన్ నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా తెలుసుకుని, ఓటు యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో చైతన్యవంతమైన పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఎలక్షన్‌ను విజయవంతం చేశారు.

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అర్బన్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా జిల్లెల రవీందర్ నియామకం



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్ )** భారతీయ జనతా పార్టీ హబ్సిగూడ డివిజన్ సీనియర్ నాయకులు జిల్లెల రవీందర్ రెడ్డి ని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అర్బన్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గా నియామకం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బాధ్యతలను నా పై నమ్మకం ఉంచి అప్పగించిన పూర్వ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ ఇచ్చిన ఏ కార్యక్రమమైన విజయవంతంగా కృషి చేస్తానని, అంకితభావంతో పనిచేస్తూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు.

## వారాసిగూడలో గంగపుత్ర జేఏసీ ఆధ్వర్యంలో నేడే బోనాలు



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** వారాసిగూడ గంగపుత్ర జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం నేడు బోనాలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. సుమారు 40 సంవత్సరాల క్రితం గంగపుత్ర సభ్యులందరూ కలిసి ఏ విధంగానైతే ఈ పండుగను జరుపుకున్నారో, మళ్లీ ఆ సాంప్రదాయాన్ని పునరుద్ధరించే అవకాశం కలగడంపై సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో బోనాలతో మహిళలు అందరూ కలిసి ఉత్సాహంగా పాల్గొననున్నారు. గంగపుత్ర సంఘాలు, సొసైటీలు మహిళా సంఘాలన్నీ ఏకమై ఈ పండుగను నిర్వహించనున్నారు. వారసిగూడ భూలక్ష్మి దేవాలయం నుంచి చిలకలగూడ కట్ట మైసమ్మ గుడి వరకు దాదాపు 100 బోనాలతో ర్యాలీగా వెళ్లనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు కొనసాగుతుంది. గంగపుత్రులందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.అమ్మవారికి సమర్పించే బోనాలకు సంబంధించిన బిందెలు, పూజా సామగ్రిని వారాసిగూడ గంగపుత్ర జేఏసీ తరఫునే ఉచితంగా సమకూర్చనున్నట్లు వారు వెల్లడించారు.

## భక్తుల సౌకర్యాలపై శ్రీశైలం ఈవో కీలక ఆదేశాలు

- సామాన్య భక్తులకు పెద్ద పీఠ
- భక్తుల సౌకర్యమంతమైన విషయంలో రాజి లేదు: ఈవో శ్రీనివాసరావు



**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** క్షేత్రానికి అన్ని ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసరావు శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేశారు.దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని క్యూ కాంప్లెక్స్‌లలో తాగునీరు, పాలు, ఫలాహారాల ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు.అదేవిధంగా ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానం కేంద్రంలో వడ్డించే భోజనం రుచిగా, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. ఆహార పదార్థాల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, ప్రతి రోజు తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈవోగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే శ్రీనివాసరావు పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, స్వచ్ఛమైన ప్రసాదం, మెరుగైన పార్కింగ్, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల అభిప్రాయాలను సేకరించి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఆలయ సిబ్బంది అందరూ భక్తులను తమ కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేయాలని ఈవో పిలుపునిచ్చారు.

# మాటలకు అందని ఒక పవిత్రమైన అనుబంధమే స్నేహం



స్నేహం అనేది ఒక అనిర్వచనీయ భావన. ఇది ఎప్పటికి శాశ్వతమైనది. స్నేహం అనేది జీవితంలో లభించే అత్యంత విలువైన బంధాలలో ఒకటి. ఇది నమ్మకం, అవగాహన, దయ, మధురమైన జ్ఞాపకాల పునాదిపై నిర్మితమవుతుంది. జాతి, మతం, సామాజిక భేదాలతో సంబంధం లేకుండా ప్రజలందరిని ఏకం చేసే శక్తి స్వచ్ఛమైన స్నేహంలో ఉంది. నిష్కల్మషమైన స్నేహాన్ని గుర్తిస్తు స్నేహ బంధాన్ని మరింత దృఢంగా మార్చే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా జరుపుకుంటారు. మన అందరి జీవితాల్లో వివిధ దశల్లో స్నేహితులు ఉంటారు. అయితే వారిలో కొందరు మనతో కొంత కాలం మాత్రమే పయనిస్తే మరికొందరు మన కష్ట సుఖాల్లో తోడుగా ఉంటు, తమను ఉన్నత స్థితికి ఎదిగేలా ప్రోత్సహిస్తు జీవితాంతం వెన్నంటి నిలుస్తారు. సంస్కృతులు, సరిహద్దులు దాటి ప్రపంచ వ్యాప్తంగా ప్రజల మధ్య శాంతి, స్నేహభావాన్ని పెంపొందించడమే స్నేహితుల దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.

### చారిత్రక నేపథ్యం

1958 లోనే స్నేహ బంధం ప్రాముఖ్యత చాటడానికి వరల్డ్ ఫ్రెండ్ షిప్ క్రూసేడ్ అనే సంస్థ ఏర్పాటుతో 2011లో ఐక్యరాజ్యసమితి అధికారికంగా జులై 30 ని స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. అయితే మన దేశంతో పాటు మరికొన్ని దేశాల్లో ఆగస్టు మొదటి ఆదివారంను స్నేహితుల దినోత్సవంగా జరుపుకోవడం సంప్రదాయంగా మారడానికి వెనుక ఒక ఆసక్తికర విషయం ఉంది. 1935 వ సంవత్సరంలో అమెరికాలో అక్కడి ప్రభుత్వం ఒక వ్యక్తిని హతమార్చింది. ఈ ఘటనతో చలించిన అతని స్నేహితుడు ఆత్మహత్య చేసుకోవడంతో స్నేహ బంధం విలువను గ్రహించిన అమెరికా ప్రభుత్వం ఆగస్ట్ మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది.

### శాంతి - ఐక్యతలో స్నేహం ప్రాముఖ్యత

భావోద్వేగ, సామాజిక శ్రేయస్సులో స్నేహం ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాబట్టి స్నేహితుల దినోత్సవానికి అత్యధిక ప్రాముఖ్యత ఏర్పడింది. స్నేహితులతో ఆత్మవిశ్వాసం, అనుబంధాన్ని పెంచుకోవడానికి తోడ్పాటును అందిస్తారు. అలాగే విద్యార్థి దశలో స్నేహం జట్టుకృషి, నిజాయితి, సానుభూతి, గౌరవం వంటి ముఖ్యమైన జీవిత విలువలను నేర్పుతుంది. అదనంగా పిల్లలు ఒకరితో ఒకరు సంభాషించుకోవడం, విభిన్న దృక్కోణాలను అర్థం చేసుకోవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ప్రపంచ స్థాయిలో దేశాల మధ్య స్నేహం, శాంతి, సాంస్కృతిక అవగాహన, సహకారాన్ని పెంపొందించడంలో తోడ్పాటును అందించడంలో ప్రాముఖ పాత్ర పోషిస్తుంది. సయోధ్య, సంఘీభావం, పరస్పర సహకారం, అంతర్జాతీయ సంబంధాల అవగాహనకు తోడ్పాటును అందించడంలో ప్రాముఖ పాత్ర స్నేహనిదే. అందుకే పలు అవగాహన కార్యక్రమాలతో స్నేహపూర్వక వాతావరణంలో ప్రజలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు స్నేహితుల దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సయోధ్య, సంఘీభావం, పరస్పర గౌరవం అంతర్జాతీయ అవగాహనకు తోడ్పాటు అందించడంలో స్నేహనిది కీలకపాత్ర. మనలోని ఒత్తిడిని తగ్గించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఆనందమయ జీవితాన్ని గడిపేలా తోడ్పాటు అందిచే వారే నిజమైన స్నేహితులు.



స్నేహితుల దినోత్సవం శుభాకాంక్షలతో
రవికుమార్ సంతోజు. (వెల్జాల్)
బడంగ్ పేట్. హైదరాబాద్

## అన్నిదానాల్లోకెల్ల అన్నదానం గొప్పది హోప్ పౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్



**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** ఆకలిగొన్న వారి ఉచితంగా అన్న వితరణ చేయడం మానవీయతకు నిదర్శనం అని హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ అన్నారు. భారీ స్థాయిలో అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొండ విజయ్ కుమార్ హజరై ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గడిచిన కొన్ని ఏళ్లుగా ఉచితంగా పోషక విలువలతో కూడిన భోజనం ఉచితంగా అందజేయడం జరుగుతుందని అన్నారు.చందానగర్ లోని గంగారం హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత భోజన అందించడం ద్వారా వేలాది మంది ఆకలిని తీర్చగలగడం గొప్ప పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యురాలు అన్నే అపర్ణ, అన్నె సందీప్, హోప్ ఫౌండేషన్ సభ్యులు జర్నలిస్ట్ నాగరత్నం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తారు రోడ్డుకు శ్రీకారం

- తోటవేంగన్నపాలెంలో 'ఇంటింటికీ టీడీపీ
- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చేతుల మీదుగా రోడ్డు ప్రారంభం
- ఐటీసీ సురక్షిత మంచినీటి ప్లాంట్ ప్రారంభోత్సవం



**తాళ్లూరు(ప్రశ్న న్యూస్)** తాళ్లూరు మండలం తోటవేంగన్నపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం -- రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమంలో దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా దోసకాయలపాడు నుంచి తోటవేంగన్నపాలెం వరకు రూ.97 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తారు రోడ్డును డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆమె తెలిపారు.అనంతరం గ్రామంలో ఇంటింటికీ పర్యటిస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గతంలో నిలిచిపోయిన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, విద్యుత్ పనులు వంటి అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తున్నామని చెప్పారు.సూపర్ సిక్స్ హామీల అమలు, మహిళల సంక్షేమం, రైతులకు అండ, యువతకు ఉపాధి అవకాశాలు, పేదలకు సామాజిక భద్రత కల్పించే కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని ఆమె పేర్కొన్నారు.అనంతరం ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ సురక్షిత మంచినీటి వాటర్ ప్లాంట్‌ను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటక కళాపరిషత్ డైరెక్టర్ బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రాచకొండ వెంకట్రావు, మానం రమేష్, యిడమకంటి శ్రీనివాసరెడ్డి, కైపు కోటిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నల్లపాటి సత్యనారాయణ, కూటాల హరిబాబు, మాజీ సర్పంచ్ బొమ్మినేని యలమంది, టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెంట్రల్--పశ్చిమలో 'ఇంటింటికీ టీడీపీ' ప్రజలతో మమేకమైన ఎంపీ చిన్ని

- ఎమ్మెల్యే బొండా ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నతో కలిసి విస్తృత పర్యటన
- సంక్షేమ పథకాలను వివరించిన ఎంపీ



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజల గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.సెంట్రల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్ ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ సమీపంలోని వర్ధనా చర్చి వద్ద నుంచి ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావుతో కలిసి, పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్ ఆరుబావుల సెంటర్‌లో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పశ్చిమ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్నతో కలిసి ఇంటింటికీ పర్యటించారు.ఈ సందర్భంగా స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఎంపీ చిన్ని మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం, పార్టీ కార్యకర్తల అంకితభావమే తెలుగుదేశం పార్టీకి బలమని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ మంచి పనులను తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సెల్ఫీ వీడియోలో కార్యకర్తల సందడిపశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఎంపీ చిన్ని ప్రత్యేకంగా సెల్ఫీ వీడియో తీశారు.

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కార్యక్రమంలో పాల్గొనడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ పార్టీ సందేశాన్ని తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నతో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఇంద్రకీలాద్రిపై విఐపీ దర్శనాలు బంద్

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిపివేత :ఈవో శీనా నాయక్



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ భారీగా ఉండనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రోటోకాల్, విఐపీ దర్శనాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు కనకదుర్గమ్మ దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ప్రకటించారు.రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సారె సమర్పణకు రానుండటంతో పాటు గత ఆదివారాల్లో ఆలయంలో తీవ్ర రద్దీ నెలకొన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఘాట్‌రోడ్డులో ప్రైవేట్ వాహనాల రాకపోకలను నియంత్రించి, దేవస్థానం బస్సులను పూర్తి స్థాయిలో నడుపుతామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే లిఫ్ట్ మార్గాన్ని వినియోగించనుండగా, మిగిలిన భక్తులు మహా మండపం ర్యాంపు మార్గం ద్వారా కొండపైకి చేరుకోవాలని సూచించారు.వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లలతో వచ్చే తల్లులు రద్దీ తక్కువగా ఉండే ఉదయం 8 గంటలకు ముందు లేదా సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య దర్శనానికి రావాలని ఈవో విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ దేవస్థానం అధికారులకు సహకరించి సౌకర్యవంతమైన దర్శనానికి తోడ్పడాలని కోరారు.

# హైడ్రా ఆగితే.. గెలిచేది ఎవరు.? నష్టపోయేది ఎవరు.?

- ప్రజా ఆస్తుల పరిరక్షణకు బ్రేక్ పడితే భవిష్యత్ తరాలకు మిగిలేది ఏమిటి.? - ప్రభుత్వ భూములను కాపాడేది ఎవరు.?
- చెరువులు ఆక్రమిస్తే బాధ్యత ఎవరిది.? - ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమా.?
- అక్రమా నిర్మాణాలను అరికట్టే వ్యవస్థలు లేకపోతే చట్టాన్నిఅమలు చేసేది ఎవరు.?
- భవిష్యత్ తరాలకు సహజ వనరులను ఏ రూపంలో అందిస్తారు.? - నగరాన్ని వరదలనుంచి రక్షించే బాధ్యత ఎవరిది.?

**ఒక నగరం అభివృద్ధి చెందాలంటే ఎత్తైన భవనాలు మాత్రమే కాదు... చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు కూడా సురక్షితంగా ఉండాలి. కానీ ఇవి క్రమంగా ఆక్రమణలకు గురైతే దాని మూల్యం చెల్లించేది చివరకు సామాన్య ప్రజలే. అలాంటి పరిస్థితుల్లో అక్రమ ఆక్రమణలపై చర్యలు తీసుకునే వ్యవస్థలు బలహీనపడితే లేదా ఆగిపోతే సమాజంపై దాని ప్రభావం ఎలా ఉంటుంది.? ఇదే ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మహానగర పరిధిలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ఓపెన్ స్పేస్‌లను రక్షించేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా వంటి వ్యవస్థల అవసరంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజా ఆస్తుల పరిరక్షణ అనే లక్ష్యంపై మాత్రం విస్తృత చర్చ కొనసాగుతోంది. ఒక చెరువును ఆక్రమిస్తే అది కేవలం నీటి వనరును కోల్పోవడమే కాదు. వర్షం పడినప్పుడు నీరు వెళ్లే మార్గం మూసుకుపోతుంది. దాని ఫలితం కాలనీల్లోకి వరద నీరు, ఇళ్లలోకి నీరు, రోడ్లపై ట్రాఫిక్ స్తంభించడం ఇప్పుడు నగరంలో ఎక్కడ చూసిన ఇదే పరిస్థితి.

### ప్రజల ఆస్తులకు నష్టం.

చెరువుల కుంటల ఆక్రమణతో చివరకు ఇబ్బంది పడేది సాధారణ కుటుంబాలే. నాలాలపై నిర్మాణాలు పెరిగితే వర్షాకాలంలో నీరు బయటకు వెళ్లక నగర జీవనం స్తంభించే ప్రమాదం ఉంటుంది. పాఠశాలలకు వెళ్లే పిల్లల నుంచి ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇంత జరుగుతున్న కబ్జాలు మాత్రం ఆగడం లేదు.

### ప్రభుత్వ భూములు పోతే.. నష్టమంతా ప్రజలదే

ప్రభుత్వ భూములు అనేవి భవిష్యత్తులో పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు వంటి ప్రజా అవసరాల కోసం ఉపయోగపడే ఆస్తులు. అవి ఆక్రమణలకు గురైతే చివరకు నష్టపోయేది ప్రభుత్వమే కాదు, ఆ సదుపాయాల కోసం ఎదురుచూసే ప్రజలే. పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఒక చెరువు కనుమరుగైతే భూగర్భ జలాలు తగ్గుతాయి. ఒక నాలా మూసుకుపోతే వరదలు పెరుగుతాయి. పార్కులు తగ్గితే కాలుష్యం పెరుగుతుంది. నగర ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. ఇవన్నీ కలిసి ప్రజల ఆరోగ్యంపై, జీవన నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

### హైడ్రా ఆగితే లాభం ఎవరికీ.? భూ ఆక్రమణదారులకు పండగేనా.?

ప్రభుత్వ భూముల, చెరువుల, కుంటల నాలాల కబ్జా పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకుంటే కబ్జాదారులకు భయము లేకుండా విచ్చలవిడిగా కబ్జాలు జరుగుతాయి. గత ప్రభుత్వంలో కబ్జాలే భారీ స్థాయిలో జరగడం వల్ల నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కబ్జాదారులకు చర్యల భయం తగ్గితే ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు ఆక్రమించే ప్రయత్నాలు పెరిగే ప్రమాదం ఉందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారికి పరిస్థితులు అనుకూలంగా మారే అవకాశం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూ మాఫియాలపై పర్యవేక్షణ తగ్గితే ప్రభుత్వ భూములపై కన్నేసే అక్రమ ముఠాలు మరింత రెచ్చిపోయి కబ్జా చేసే ప్రమాదం ఉందని పట్టణాభివృద్ధి నిపుణులు చెబుతున్నారు.

### హైడ్రా కొనసాగితే ప్రజలకు కలిగే ప్రయోజనాలు

ప్రజా భూముల పరిరక్షణకు అవకాశం.చెరువులు, కుంటలు, పార్కులు, నాలాల సంరక్షణ ద్వారా వరదల ప్రమాదం తగ్గే అవకాశం ఉంది. హైడ్రాతో చట్టబద్ధ నిర్మాణాలకు ప్రోత్సాహం, అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట,భవిష్యత్ తరాలకు సహజ వనరుల పరిరక్షణ ఏర్పడుతుంది.అయితే మరోవైపు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే సమయంలో చట్టపరమైన ప్రక్రియ, నోటీసులు, కోర్టు ఆదేశాలు, బాధితులకు తమ వాదన వినిపించే అవకాశం వంటి న్యాయపరమైన హక్కులు కూడా సమానంగా పరిరక్షించబడాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. ప్రజా ఆస్తుల పరిరక్షణతో పాటు చట్టబద్ధమైన విధానాలు పాటించడం కూడా అంతే ముఖ్యమని వారు అభిప్రాయపడుతున్నారు.

### హైడ్రాలో మనం కూడా భాగమే..

ఒక చెరువు కాపాడితే వేల కుటుంబాలు వరదల నుంచి రక్షించబడవచ్చు. ఒక నాలా పరిరక్షిస్తే నగర జీవనం సాఫీగా సాగుతుంది. ఒక ప్రభుత్వ భూమిని రక్షిస్తే రేపటి తరాలకు పాఠశాల, ఆసుపత్రి లేదా పార్కు రూపంలో ఉపయోగపడుతుంది. అందుకే ప్రజా ఆస్తుల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత కూడా ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, చట్టబద్ధ హక్కులు,ఈ మూడింటి మధ్య సమతుల్యతను కాపాడే విధానాలే నగర భవిష్యత్తుకు బలమైన పునాది అవుతాయని ప్రతి ఒక్కరు భావించాలి. హైడ్రా ని సపోర్ట్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# కార్పోరేట్ వైద్యం - పేదలకు దూరం

- కార్పొరేట్ ధరలు చూసి దూరమైతున్న ప్రజలు
- సామాన్యులు వెళితే ఆస్తులు అమ్ముకోవాల్సిందేనా.?
- "వైద్యో నరాయణో హరి" అనే పదానికి కార్పొరేట్ లో అర్థం లేదా.?
- కార్పొరేట్ ఆసుపత్రుల ధరలు కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వైద్యుడు శ్రీ మన్ నారాయణుడితో సమానం. ధన్వంతరి వారసులుగా రోగాలతో బాధపడే వారికి సేవ చేయాల్సిన వైద్యులు ప్రస్తుతం కార్పోరేట్ వైద్యం పేరుతో వైద్య రంగాన్ని వ్యాపారంగా మార్చేసారు. రోగి ఆసుపత్రికి వెళ్లిన దగ్గర నుండి బయటకు వచ్చే వరకు డాక్టర్ అపాయింట్మెంట్ నుండి, టెస్టులు, మందులు ఇలా అన్నిటితోను పూర్తిస్థాయిలో వ్యాపారమే చేస్తున్నారు. కానీ సరైన వైద్యం ఎక్కడ జరగడం లేదన్న విమర్శలు జోరుగా ఉన్నాయి.

### సామాన్యుల జేబులకు చిల్లు

ప్రైవేట్ ఆసుపత్రుల ఉచ్చులో చిక్కుకొనే సామాన్యులకు జేబులు గుల్ల చేసుకోవడం తప్ప, వారికి చేకూరే ప్రయోజనం పెద్దగా కనిపించడం లేదు. అయితే ఇప్పటికి ఇంకా నిబద్ధతతో పని చేస్తున్న వైద్యులు ఉన్నారు కాబట్టి సమాజంలో చాలా మంది రోగాల నుండి బయటపడి ఆరోగ్యంగా జీవిస్తున్నారు. కానీ ఇదే సమయంలో పవిత్రమైన వైద్య వృత్తిలో కొనసాగుతు కేవలం దోపిడీయే లక్ష్యంగా పెట్టుకుని ట్రీట్మెంట్ చేస్తున్న వైద్యులతోనే పేదలకు కార్పోరేట్ వైద్యం అందనంత ఎత్తుకు ఎదిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కార్పోరేట్ వైద్యంలో ప్రతీ దానికో రేటు

అనారోగ్యంతో ఒక సాధారణ వ్యక్తి వైద్యం కోసం కార్పోరేట్ ఆస్పత్రి కడపలో కాలుపెట్టేదే తరువాయి డాక్టర్ అపాయింట్మెంట్ ఫీజు నుండి (డాక్టర్ కి ఉన్న పేరును బట్టి 5వందల నుండి వెయ్యి రూపాయల పైనే ఫేజు ఉంటుంది. ఇంకా పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులలో అయితే రూ. 1500 వరకు ఉన్నాను ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు) ఇక డాక్టర్ దగ్గరికి వెళ్లి చెక్ చేయించుకున్న తర్వాత, టెస్టుల పేరుతో అసలు దోపిడీ మొదలవుతుంది. డయాగ్నస్టిక్ సెంటర్ ల నుండి డాక్టర్ లకు కమీషన్లు అందుతుండడంతో డాక్టర్ రాసిన టెస్టులు చేయించుకోవాలంటే అతను సూచించిన డయాగ్నస్టిక్ సెంటర్ కు మాత్రమే వెళ్లి అక్కడ మాత్రమే టెస్టులు చేయించుకుని రావాల్సిందే. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులలో ఉన్న వైద్యులు చేస్తున్న దందాలలో ఇది ఒకటి.ఫార్మా కంపెనీలతో వైద్యుల టై అప్ మరో మోసం. టెస్ట్ రిపోర్టులు వచ్చిన తర్వాత డాక్టర్ వాటిని పరిశీలించి మందులు రాయాలి. కాని డాక్టర్లు వివిధ కంపెనీలతో పెట్టుకున్న టై అప్ ఆధారంగా రాస్తారు. జనరిక్ మెడిసిన్ రాయకుండా, తమకు కమీషన్లు ఇచ్చే కంపెనీలకు సంబంధించిన మందులను మాత్రమే తీసుకోండి అని సూచిస్తున్నారు.

ఒక్కో కంపెనీ టాబ్లెట్లు విపరీతమైన ధర ఉంటుంది. కొందరు వైద్యులు ధనార్జనే ధ్యేయంగా అవసరం లేని మందులు సూచించడం గమనార్హం.

### మందులతోను వైద్యుల దందా

ఇక వైద్యులు సూచించిన మందులను ఆసుపత్రిలోనే కొనుక్కోవాలి. కాని బయట కొనుక్కుందాం అన్నా దొరకనివి రాస్తారు. ఇక డాక్టర్ సూచించారని గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఆయన రాసిన మందులను రోగులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లిన సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

### కార్పొరేట్ ఆసుపత్రుల తీరుతో ఆరోగ్య సంక్షోభం

ఇంత ఖర్చు పెట్టిన సరైన వైద్యం దొరుకుతుందా అంటే 70 శాతం మంది లేదు అని చెబుతున్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ ఆసుపత్రుల తీరును ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి అడ్డు, అదుపు లేకుండా పోతుందని లబోదిబోమంటున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల పుణ్యమా అంటూ ఆరోగ్య సంక్షోభం నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

## ప్రజ్ఞాపూర్ గర్ల్స్ స్కూల్ రహదారి దుస్థితి..

### విద్యార్థులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్ )** గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజ్ఞాపూర్ గర్ల్స్ స్కూల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్డంతా గుంతలతో నిండిపోయి, వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యేకంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు ప్రతిరోజూ ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి వస్తుండటంతో ప్రమాదాల భయం నెలకొంది. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారి నీరు నిలిచిపోతుండడంతో రాకపోకలు కష్టంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, నిల్వ నీటిని తొలగించి, దెబ్బతిన్న రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

### - వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లేనన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## నాడు ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతు

### - సంచలన లేఖలను బయటపెట్టిన జైరాం రమేశ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో ఇందిరా గాంధీ విధించిన అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ)కి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మద్దతు తెలిపిందన్న తన వాదనను నిరూపించేందుకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ రాజ్యసభలో కీలక ఆధారాలను సమర్పించారు. 1975లో నాటి ఆర్ఎస్ఎస్ అధినేత బాలసాహెబ్ దేవరస్ రాసిన మూడు లేఖలను ఆయన శుక్రవారం సభాపతికి అందజేశారు. ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతునిచ్చిందనడానికి ఆధారాలు చూపాలని బీజేపీ ఎంపీలు గురువారం విసిరిన సవాలుకు సమాధానంగా జైరాం రమేశ్ ఈ చర్య తీసుకున్నారు. ఈ లేఖలను చారిత్రక ఆధారాలుగా జైరాం రమేశ్ పేర్కొన్నారు. వీటిలో రెండు లేఖలను దేవరస్ నాటి ప్రధాని ఇందిరా గాంధీకి రాయగా, మరొకటి ఆచార్య వినోబా భావేకి రాశారు. 1975 ఆగస్టు 22న ఇందిరా గాంధీకి రాసిన లేఖలో, ఆమె చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం "సమయోచితంగా, సమతుల్యంగా ఉంది" అని దేవరస్ ప్రశంసించారు. ఆర్ఎస్ఎస్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ, దేశాభివృద్ధిలో తమ సంస్థ సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 1975 నవంబర్ 10న రాసిన మరో లేఖలో, ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లుబాటును సుప్రీంకోర్టు సమర్థించినందుకు ఆమెకు అభినందనలు తెలిపారు. జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ఉద్యమంతో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సంస్థపై నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని మరోసారి కోరారు. ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భాగస్వాములు అయ్యేలా, ప్రధానికి తమపై ఉన్న అపోహలను తొలగించాలని వినోబా భావేను ఆయన కోరారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588